


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 187 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 13 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :187 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 13 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## ఫరూక్ అబ్దుల్లాపై నాన్ బెయిలబుల్ వారెంట్

- జేకేసీఏ స్కామ్ కేసులో ఫరూక్ అబ్దుల్లాకు నాన్ బెయిలబుల్ వారెంట్
- వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్‌ను తిరస్కరించిన శ్రీనగర్ కోర్టు
- క్రికెట్ నిధుల దుర్వినియోగంపై సీబీఐ గతంలోనే ఛార్జిషీట్ దాఖలు
- మార్చి 30కి తదుపరి విచారణను వాయిదా వేసిన న్యాయస్థానం

మిగతా 2లో





# దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్...

## జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో అటానమస్ షిప్ యార్డ్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- సాగర్ డిఫెన్స్ సంస్థ తొలి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి
- వెయ్యి మందికి పైగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు
- ఏపీని మారిటైం రోబోటిక్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- 2026 నవంబర్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, రక్షణ రంగాల్లో మరో కీలక ముందడుగు పడింది. దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా పెంచే దిశగా నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద దేశంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. శంకుస్థాపన కార్యక్రమానికి జువ్వలదిన్నె చేరుకున్న మంత్రి లోకేశ్ కు సాగర్ డిఫెన్స్ సంస్థ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం

మిగతా 2లో

## పన్ను ఎగవేతదారులు తప్పించుకోవడానికి వీల్లేదు

- పన్ను ఎగవేతలను అరికట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇతర రాష్ట్రాల్లో ఉంటూ ఏపీలో పనిచేసే కాంట్రాక్టర్లపై ప్రత్యేక దృష్టి
- పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందే లబ్ధిని వివరిస్తూ సంక్షేమ లేఖ ఇవ్వాలని ఆదేశం
- పథకాల అమలులో పూర్తి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యమని వెల్లడి

మిగతా 2లో





## గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే..

### లేదంటే అటాక్ చేస్తూనే ఉంటాం

### ఇరాన్ సుప్రీం లీడర్ ఫస్ట్ రియాక్షన్

పెన్ పవర్ డెస్క్:గల్ఫ్ లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే.. లేదంటే అటాక్ చేస్తూనే ఉంటాం.. ఇది ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఫస్ట్ రియాక్షన్. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత కొత్తగా అపాయింట్ అయిన మొజ్తాబా ఖమేనీ.. చాలా రోజులుగా మౌనం వహిస్తూ.. గురువారం (మార్చి 12) తొలిసారిగా స్పందించారు. ఈ సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి

మిగతా 2లో

## వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు

### కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు సమీక్ష
- వడదెబ్బ మరణాలు నివారించాలని స్పష్టమైన ఆదేశం
- వైద్యంలో ఏఐ, టెక్నాలజీ వినియోగాన్ని పెంచాలని సూచన
- 108 అంబులెన్సులు వేగంగా చేరేలా చర్యలు చేపట్టాలి
- ఉపాధి కూలీలు, పశువుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టీకరణ

మిగతా 2లో



## హార్మూజ్ మీదుగా భారత్ వచ్చే నౌకల ప్రయాణంపై ఇరాన్‌తో చర్చించాం

- దేశ ఇంధన భద్రతపై చర్చించినట్లు రణధీర్ జైస్వాల్ వెల్లడి
- డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని వెల్లడి
- ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్న భారత్

పెన్ పవర్ డెస్క్:హార్మూజ్ జలసంధి మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి ఇరాన్‌తో చర్చిం చామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. దేశ ఇంధన భద్ర తపై ఆ దేశంతో చర్చించినట్లు తెలిపారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడు తూ, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభు త్వం విజ్ఞప్తి చేసిందని అన్నారు. శ్రీలంక, మాల్దీవుల నుంచి కూడా ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని కానీ ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం

మిగతా 2లో







## ఇది ప్రారంభం మాత్రమే... గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

- దేశానికి ఇంధన సంక్షోభం ముంచుకొస్తోందని రాహుల్ గాంధీ హెచ్చరిక
- గ్యాస్, పెట్రోల్, ఎల్పీజీ సరఫరాలో తీవ్ర సమస్యలు తప్పవని ఆందోళన
- ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాలే ఈ పరిస్థితికి కారణమని విమర్శ
- ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సూచన
- ఈ అంశంపై మాట్లాడేందుకు లోక్‌సభలో అనుమతి నిరాకరించారని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దేశ ఇంధన భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాల కారణంగా దేశం త్వరలో గ్యాస్, పెట్రోల్ వంటి ఇంధనాల

మిగతా 2లో

## సీఎం చంద్రబాబు అభినందించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేశ్

- ఏపీ పర్యాటక రంగంలోకి పెట్టుబడులు.. సీఎం చంద్రబాబు ప్రశంసలు
- విశాఖలో భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్
- రూ.100 కోట్లతో ఒప్పందం
- ముంబై పర్యటన విజయవంతం అయిందన్న మంత్రి కందుల దుర్గేశ్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు తాను జరిపిన ముంబై పర్యటనను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించడంపై రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ ఆనందం వ్యక్తం చేశారు. సీఎం ప్రశంసలు తనలో మరింత ఉత్సాహాన్ని నింపాయని ఆయన తెలిపారు.ముంబయిలో జరిగిన ఐఏఏపీఐ ఎక్స్‌పోలో తాను పాల్గొని, రాష్ట్ర పర్యాటక పాలసీ, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించినట్లు మంత్రి తెలిపారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ప్రముఖ సంస్థ 'మోడ్రన్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్' విశాఖపట్నంలో రూ.100 కోట్ల పెట్టుబడితో ఒక భారీ అమ్యూజ్‌మెంట్

మిగతా 2లో



## ఇఫ్తార్ విందులు సరే... రంజాన్ తోఫా ఏది?

- రంజాన్ తోఫా ఇవ్వకుండా ఇఫ్తార్ విందులు ఎందుకని ప్రభుత్వానికి ప్రశ్న
- చంద్రబాబు మోదీకి, బీజేపీకి భయపడుతున్నారని ఆరోపణ
- మైనారిటీ సంక్షేమంపై కూటమి ప్రభుత్వానిది బూటకమని విమర్శ
- వెంటనే పేద ముస్లింలకు తోఫా పంపిణీ చేయాలని డిమాండ్

మిగతా 2లో

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరుడి అరెస్ట్

- కర్నాటి వీరభద్రరావును అరెస్ట్ చేసిన విజయవాడ పటమట పోలీసులు
- హైకోర్టు అడ్వకేట్‌ను నిర్బంధించి బలవంతంగా ఆస్తులు రాయించుకున్నట్టు ఆరోపణలు
- పరారీలో ఉన్న మరో నిందితుడు కర్నాటి సతీశ్

మిగతా 2లో



పెన్ పవర్






# ఇంటి అమ్మాయిలను కాపాడుకుందాం!

కేంద్ర ప్రభుత్వం 2025 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మహిళల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకోని హ్యూమన్ పపిల్లోమ వైరస్ టీకా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. మన రాష్ట్రంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ కింగ్ కోటి ఆసుపత్రి నుంచి ఈ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఇక ఈ టీకా కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8వ తారీఖున మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ఆరోగ్య కేంద్రాలలో ప్రారంభమయింది. హ్యూమన్ పపిల్లోమ వైరస్ లైంగిక సంపర్కం వల్ల సంక్రమించే వ్యాధి. హ్యూమన్ పపిల్లోమ వైరస్‌లు మొత్తం 200 రకాల వరకు ఉన్నాయి.. ఇందుకు గర్భాశయ కాన్సర్‌కు కారణమయ్యేవి 6,11,16,18 రకానికి సంబంధించినవి. ఎక్కువ మంది మహిళలు ఈ వైరస్ బారిన పడి కేన్సర్ బాధితులుగా మారుతున్నారు.. ఈ కేన్సర్‌ను ఎదుర్కొంటున్న వారిలో పెళ్లిళ్లు అయిన మహిళలే అధికంగా ఉంటున్నారు.. ప్రారంభ స్థాయిలోనే ఈ వైరస్‌ను అరికట్టాలన్నది ప్రభుత్వ ఆశయం. అందుకే కేంద్ర ప్రభుత్వం 14. సం? దాటి 15 సం?లోపు , అమ్మాయిలకు ఈ వాక్సిన్ ఇవ్వాలన్నది టార్కెట్‌గా నిర్ణయించు కున్నది. ఈ స్కీంలో బాగంగా 14 సం.నిండిన బాలికలకు గర్థాసిల్– 4 వాక్సిన్‌ను ఒక డోస్ ఇస్తారు. ఈ వాక్సిన్ అమ్మాయిల్లో వైరస్ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. గర్భాశయ కేన్సర్ పట్ల మన సమాజంలో అవగాహన చాలా తక్కువ. సెక్స్‌లో పాల్గొన్నప్పుడు అధిక రక్త స్రావం, ఋతు క్రమంలో ఎక్కువ రోజులు రక్తస్రావం, ఆ సందర్భంగా ఋతు క్రమం రావడం, ఋతు క్రమంలో దుర్గంధం ఉండడం మొద లైనవి గర్భాశయ కాన్సర్‌కు ముందస్తు హెచ్చరికలు..ఈ నెల 8వ తారీఖు నుండి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో, ఏరియా జిల్లా వైద్య ఆసుపత్రి కేంద్రాలో ఉదయం 10 గం? నుండి మ 2 గం ? వరకు 14 సం ? నిండి 15 సం ? దాటని అమ్మాయిలకు సింగల్ డోస్గా గర్థసిల్ - 4 అనే వాక్సిన్ ఇస్తారు.. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ వాక్సిన్‌ను ఉచితంగా అందిస్తుంది. టీకా తీసుకోవాల్సిన అమ్మాయిల తల్లితండ్రులు యూ–విన్ సైట్ ద్వారా అమ్మాయి పేరు రిజిస్టర్ చేసుకోవాలి. అమ్మాయిలకు టీకా వేయాలంటే తల్లితండ్రులు అంగీకారం తప్పనిసరి. గర్భంతో ఉన్న మహిళలు ఈ వాక్సిన్ వేసుకోరాదు. అనారోగ్య సమస్యలు, జ్వరంతో బాధపడుతున్న వారు కుదుట పడే వరకు అగడం మంచిది. గతంలో హెచ్.పి.వి టీకా కాని తీసుకుని ఉంటే మళ్లి తీసుకోవాల్సిన అవసరం లేదు. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉండాలి. ఎందరో మహిళలు హెచ్.పి.వి వైరస్ బారిన పడి ఆసుపత్రుల చుట్టు తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. గర్భాశయ కేన్సర్‌పై అవగాహన లేక ఎన్నో కుటుంబాలు ఆ ఇంటి తల్లులను కోల్పోతున్నాయి.. ప్రభుత్వం ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో 14 సం. నిండిన అందరు అమ్మాయిలకు వాక్సిన్ ఇవ్వడానికి పూనుకుంది. ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణంలో మన మందరం బాగస్వాములమవుదాం. మన ఇంటి అమ్మాయిలను కాపాడుకుందాం.

# గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే..

- మొదటి పేజి తరువాయి

మిత్ర దేశాలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

**ఖమేనీ స్టేట్‌మెంట్స్:**

హర్మ్యూజ్ జలసంధి మేసే ఉంటుంది
మిత్ర దేశాలతో స్నేహం కొనసాగుతుంది
కానీ అమెరికాతో అంటకాగితే పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది
పశ్చిమాసియాలో ఉన్న అమెరికా ఆర్మీ బేస్ క్యాంపులను ఎత్తేయాలి
లేదంటే వాటిపైన మరింత తీవ్రంగా దాడి చేస్తాం
సైనిక స్థావరాలు మూసేవరకు టార్గెట్ చేస్తూనే ఉంటాం
హర్మ్యూజ్ జలసంధిని బ్లాక్ చేసే ప్రాంతాన్ని వాడుకుంటూ యుద్ధంలో పైచేయి సాధిస్తాం
గల్ఫ్ దేశాలు అమెరికా మిలిటరీ బేస్ లను మూసివేయాలి
లేదంటే మా ఫస్ట్ టార్గెట్స్ అవే అవుతాయి

ఆయతొల్లా ఖమేనీపై జరిగిన దాడిలో ఆయన కుమారుడైన మొజ్తాబా ఖమేనీ గాయపడినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇన్నాళ్లుగా మౌనంగా ఉన్న ఆయన తొలిసారి ఇరాన్ ప్రజలను ఉద్దేశించి సందేశం పంపారు. అదే విధంగా అమెరికాతో పాటు దాని మిత్ర దేశాలు, పొరుగు దేశాలకు కూడా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఖమేనీ పంపిన సందేశాన్ని ఇరాన్ ప్రభుత్వ టీవీలో న్యూస్ ప్రజెంటర్ చదివి వినిపించారు.

# దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్...

- మొదటి పేజి తరువాయి

పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ప్రాజెక్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కూటమి ప్రభుత్వం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో 29.58 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇందులో 7.58 ఎకరాల వాటర్ ఫ్రంట్ ల్యాండ్ కూడా ఉండటం విశేషం. మొదటి దశలో సాగర్ డిఫెన్స్ సంస్థ రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన–అభివృద్ధి వంటి కీలక రంగాల్లో ఉపాధి లభిస్తుంది. 2026 నవంబర్ నాటికి ఈ కేంద్రంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టును మొత్తం 200 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో బ్లూ ఎకానమీ, మారిటైం ఆవిష్కరణలు బలోపేతం కావడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌ను మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా నిలబెట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అంతకుముందు, జిల్లాకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్ కు బోగోలు మండలం కప్పరాలతిప్ప వద్ద నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతి రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పి.సునీల్ కుమార్, ఎస్.విజయశ్రీ, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు, సాగర్ డిఫెన్స్ సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్ తదితరులు పాల్గొన్నారు.

# పన్ను ఎగవేతదారులు తప్పించుకోవడానికి వీల్లేదు

రాష్ట్రంలో పన్ను ఎగవేతలను నిరోధించేందుకు పటిష్ఠమైన కార్యాచరణ చేపట్టాలని, ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో కొనసాగుతున్న ఆరో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆయన ఆదాయార్జన శాఖలతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా పన్ను ఎగవేతలపై కఠినంగా వ్యవహరించాలని, అయితే పన్ను చెల్లింపుదారులను అనవసరంగా వేధించవద్దని స్పష్టం చేశారు.కొందరు కాంట్రాక్టర్లు తమ కార్యాలయాలను పొరుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకొని, ఆంధ్రప్రదేశ్‌లో పనులు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, ఇతర ప్రాజెక్టుల పనులు చేస్తున్నప్పటికీ, వారి నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నులు రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. టెండర్లు, వర్క్ ఆర్డర్లలో ఉన్న కాంట్రాక్టర్ల నుంచి ఆదాయం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కాంట్రాక్టర్లు చెల్లించే పన్నులు మన రాష్ట్ర ఖజానాకే చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గట్టిగా చెప్పారు."పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి నమోదైతేనే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వస్తుంది. ప్రతి రంగంలోనూ వృద్ధి సాధించడం ద్వారా నిర్దేశిత జీఎస్‌డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. పన్ను ఎగవేతలకు పాల్పడి ఎవరూ తప్పించుకోవడానికి వీల్లేదని, చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పన్ను వసూళ్ల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తూనే, నిజాయితీపరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

**ప్రతి లబ్ధిదారుడికి 'సంక్షేమ లేఖ'**

సూపర్ సిక్స్ సహా ఇతర సంక్షేమ పథకాల అమలులో పూర్తిస్థాయి పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ 'సంక్షేమ లేఖ' అందజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "ప్రతి నెలా ఏ కుటుంబానికి పెన్షన్, ఉచిత సిలెండర్, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరుతుందో స్పష్టంగా తెలియజేస్తూ లేఖ ఇవ్వాలి. దీనివల్ల ప్రభుత్వ పనితీరులో పారదర్శకతతో పాటు, లబ్ధిదారుల్లో పథకాలపై యాజమాన్య భావన పెరుగుతుంది" అని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి త్వరలోనే ఒక క్యాలెండర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.
"పెట్టుబడుల గురించి ఎలా ఆలోచిస్తున్నామో, అదే స్థాయిలో పేదల సంక్షేమం, వారి సాధికారత గురించి కూడా కలెక్టర్లు ఆలోచించాలి. సంపద సృష్టితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద మార్చి 9 నాటికి 50.45 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయని, ఇందుకోసం ఆర్టీసీకి ప్రభుత్వం రూ.1,775 కోట్లు రీయింబర్స్ చేసిందని తెలిపారు.సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఉగాది నాటికి 2.5 లక్షల సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని, ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు.

# వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు

ఈసారి వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వడగాలుల కారణంగా రాష్ట్రంలో ఒక్క మరణం కూడా సంభవించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. అమరావతిలో రెండో రోజు కొనసాగుతున్న 6వ జిల్లాల కలెక్టర్ల సదస్సులో ఆయన వైద్యారోగ్యం, వేసవి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలను నిరంతరం నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న పశు బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు.
వైద్యారోగ్య రంగంపైనా సీఎం పలు కీలక సూచనలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వైద్య పరీక్షలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా తరలించగలిగే వైద్య పరికరాలను తయారు చేయాలని సూచించారు.
మారుమూల ప్రాంతాలకు సైతం 108 అంబులెన్సులు వేగంగా చేరుకునేలా రూట్ ఆప్టిమైజేషన్ చేయాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరుడి అరెస్ట్

వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు కర్నాటి వీరభద్రరావును విజయవాడ పటమట పోలీసులు ఈరోజు అరెస్టు చేశారు. ఏపీ హైకోర్టు అడ్వకేట్‌ను కిడ్నాప్ చేసి, నిర్బంధించి హింసించినట్లు నమోదైన కేసులో వీరభద్రరావును ఏ–1గా పోలీసులు చేర్చారు.కేసు వివరాల్లోకి వెళితే... 2023 నవంబర్ 7వ తేదీన హైకోర్టు అడ్వకేట్‌ను అక్రమంగా నిర్బంధించి, తీవ్రంగా హింసించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనపై దొంగ కేసులు పెట్టి, కిడ్నాప్ చేసి, ప్రాణభయం చూపించి బలవంతంగా ఆస్తులు రాయించుకున్నారని సదరు అడ్వకేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కిడ్నాప్ ఉదంతంలో అప్పటి డీఎస్పీ పల్లంరాజు, ఎస్ఐ రబ్బానీ నిందితులకు సహకరించినట్లు విచారణలో తేలింది. వీరు ఇప్పటికే శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌లో ఉన్నారు.ఈ కేసులో కర్నాటి వీరభద్రరావుతో పాటు కర్నాటి సతీశ్‌లపై కూడా తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. వీరిద్దరూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అత్యంత సన్నిహితులుగా పేరు పొందారు. వీరభద్రరావు అరెస్టుతో ఈ కేసులో కీలక పురోగతి లభించినట్లయింది. మరో నిందితుడు కర్నాటి సతీశ్ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కేసులో విజయవాడ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ఇఫ్తార్ విందులు సరే.. రంజాన్ తోఫా ఏది?

ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులు బాగానే ఉన్నాయని, కానీ పేద ముస్లింలకు ఇస్తానన్న 'రంజాన్ తోఫా' సంగతేంటని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'చంద్రన్న తోఫా' ఇస్తామని చెప్పి, రెండేళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ఆమె నిలదీశారు.
ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి, 12 లక్షల పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడానికి అవసరమైన రూ.65 కోట్లు బరువయ్యాయా?" అని విమర్శించారు. గతంలో తోఫా ఇవ్వనందుకు జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మీకు ఎలా చెప్పాలో ఆలోచించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.కూటమి ప్రభుత్వం చెబుతున్న మైనారిటీ సంక్షేమం అంతా బూటకమని షర్మిల ఆరోపించారు. "చంద్రబాబు ప్రధాని మోదీకి వణుకుతున్నారు. బీజేపీకి, ఆర్ఎస్ఎస్ భావజాలానికి ముఖ్యమంత్రి గులాంగిరీ చేస్తున్నారు. మైనారిటీలకు నిధులిస్తే తమ సంక్షేమం ఎక్కడ ఆగిపోతుందోనని భయపడుతున్నారు"
అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మైనారిటీల అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఫరూక్ అబ్దుల్లాపై నాన్ బెయిలబుల్ వారెంట్

జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాకు శ్రీనగర్ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ) నిధుల దుర్వినియోగం కేసులో ఆయనపై గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ కేసు విచారణలో భాగంగా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఫరూక్ అబ్దుల్లా దాఖలు చేసిన పిటిషన్‌ను శ్రీనగర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. తక్షణమే ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను మార్చి 30వ తేదీకి వాయిదా వేసింది. జేకేసీఏలో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఈ కేసులో నిందితులపై అభియోగాల నమోదు ప్రక్రియ కోసం గురువారం కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగానే న్యాయస్థానం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. జేకేసీఏ అధ్యక్షుడిగా ఫరూక్ అబ్దుల్లా ఉన్న సమయంలో క్రికెట్ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించారని, భారీగా దుర్వినియోగం జరిగిందని ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కుంభకోణంపై ఇప్పటికే దర్యాప్తు చేపట్టిన కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఫరూక్ అబ్దుల్లాతో పాటు పలువురిపై రణబీర్ పీనల్ కోడ్ (ఆర్‌పీసీ)లోని సెక్షన్ 120–బి (కుట్ర), 406 (విశ్వాసఘాతుకం), 409 (ప్రభుత్వ ఉద్యోగిగా నిధుల దుర్వినియోగం) కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.
ఫరూక్ అబ్దుల్లాతో పాటు జేకేసీఏ మాజీ అధికారులు అహ్సన్ అహ్మద్ మీర్జా, మహ్మద్ సలీం ఖాన్, బషీర్ అహ్మద్ మిస్గర్‌లను కూడా సీబీఐ నిందితులుగా చేర్చింది. కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టినట్టు దర్యాప్తులో తేలిందని సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. చాలాకాలంగా కొనసాగుతున్న ఈ కేసులో, తాజా కోర్టు ఆదేశాలతో విచారణ ప్రక్రియ వేగవంతం కానుంది.

# సీఎం చంద్రబాబు అభినందించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేశ్

- మొదటి పేజి తరువాయి

పార్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు.
ఈ పర్యటనలోనే ఏఐ ఆధారిత సినిమా, స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలపై యూరోస్ సంస్థ ప్రతినిధులతో ఫలప్రదమైన చర్చలు జరిపినట్లు దుర్గేశ్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశంతో అమరావతిలో 'క్రియేటివ్ సిటీ'ని ఏర్పాటు చేసి, రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీకి కొత్త అవకాశాలు సృష్టించేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఇది ప్రారంభం మాత్రమే... గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

- మొదటి పేజి తరువాయి

విషయంలో తీవ్ర సవాళ్లు ఎదుర్కోబోతోందని హెచ్చరించారు. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది... ఇది ప్రారంభం మాత్రమే అని అన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తగిన ఏర్పాట్లు చేయాలని గురువారం డిమాండ్ చేశారు.పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ, దేశంలో నెలకొన్న గ్యాస్, ఎల్పీజీ పరిస్థితిపై సభలో మాట్లాడేందుకు తాను ప్రయత్నించగా, తనకు అనుమతి లభించలేదని తెలిపారు. "సాధారణంగా సభలో మాట్లాడటానికి ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇప్పుడు కొత్త విధానం మొదలైనట్లుంది. నేను మాట్లాడాలనుకున్న అంశంపై ముందు మంత్రి నిర్ణయిస్తారు, ఆ తర్వాతే నేను మాట్లాడాలి. మళ్ళీ ఆ తర్వాత మంత్రి స్పందిస్తారు. ఈ కొత్త పద్ధతి ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో గ్యాస్, పెట్రోల్, అన్ని రకాల ఇంధనాలు పెద్ద సమస్యగా మారనున్నాయి. ఎందుకంటే మన ఇంధన భద్రత దెబ్బతింది. ప్రభుత్వ లోపభూయిష్ట విదేశాంగ విధానం ఈ సమస్యను సృష్టించింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ మేల్కొని సన్నాహాలు ప్రారంభించాలి. లేకపోతే కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతారు" అని స్పష్టం చేశారు.ఈ సమస్య కేవలం ఇరాన్ వంటి దేశాలు ఇంధన సరఫరాను అనుమతిస్తాయా లేదా అనేదాని కంటే చాలా పెద్దదని రాహుల్ అన్నారు. "మనం ఒక అస్థిరమైన కాలంలోకి అడుగుపెడుతున్నాం. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని తెలిపారు.తాను చేస్తున్నది రాజకీయ విమర్శ కాదని, రాబోయే పెను ప్రమాదం గురించి కేవలం హెచ్చరిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "ఇది రాజకీయ ప్రకటన కాదు. నా కళ్లకు ఓ పెద్ద సమస్య కనిపిస్తోంది. ప్రపంచం మారుతోంది, దాని నిర్మాణం కూడా మారుతోంది. కాబట్టి మనం కూడా మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. స్పష్టతతో పనిచేయకపోతే, మారుతున్న ప్రపంచంలో భారత్‌ను 'కేంద్రంగా' నిలపకపోతే సమస్యలు తప్పవు" అని ఆయన పేర్కొన్నారు.

# హార్ముజ్ మీదుగా భారత్ వచ్చే నౌకల ప్రయాణంపై ఇరాన్‌తో చర్చించాం

- మొదటి పేజి తరువాయి

పరిగణ నలోకి తీసుకుంటోందని అన్నారు.ఇరాన్‌లో ప్రస్తుతం సుమారు 9 వేల మంది భారతీయులు ఉన్నారని ఆయన వెల్లడించారు. ఇందులో విద్యార్థులు, నౌక సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం మొదలైనప్పటి నుంచి అక్కడి భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటుందని అన్నారు.ఆఫ్ఘనిస్థాన్‌తో ఘర్షణకు భారత్ కారణమని పాకిస్థాన్ ఆరోపణలు చేయడంపై రణధీర్ జైశ్వాల్ స్పందించారు. పాకిస్థాన్‌వి నిరాధార ఆరోపణలని అన్నారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు అలవాటే అన్నారు. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచి పోషిస్తోందని మండిపడ్డారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# వీఈఆర్‌లో ఐటీ రంగ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

## 60 రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఐటీ శాఖ ఆదేశం





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 12** :విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ వీఈఆర్ పరిధిలో ఐటీ రంగాన్ని వేగంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ సెక్రటరీ కాటమనేని భాస్కర్ తెలిపారు. ఐటీ పార్కుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడులను ఆకర్షించే చర్యలపై గురువారం విశాఖపట్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఈఆర్ పరిధిలో ఐటీ పార్కు లు, డేటా సెంటర్లు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచిం చారు. ఇప్పటికే ఉన్న ఐటీ క్లస్టర్లను విస్తరించ డంతో పాటు కొత్తగా అభివృద్ధి చేసే అవకాశాల ను కూడా పరిశీలించాలని తెలిపారు. ఐటీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు రోడ్డు కనెక్టివిటీ, కమర్షియల్ స్పేస్, వినోద సదుపాయాలు, సా మాజిక మౌలిక వసతులు వంటి అంశాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, నిప్పన్ కోయి కన్సల్టెన్స్ సంస్థలు కలిసి ప్రాజెక్టులపై సమగ్ర అధ్యయనం చేసి ప్రాక్టికల్ రిపోర్ట్ సిద్ధం చేయాలని ఆదేశించా రు. ఈ ప్రణాళిక అమలుతో ప్రాంతంలో భారీగా ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని ఆ యన పేర్కొన్నారు. సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఐటీ రంగ అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను 60 రోజు ల్లో సిద్ధం చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం, పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, జీవీఎంసీ ఏడీసీ వర్మ తదితర అధికారులు పాల్గొన్నారు. వీఈఆర్ పరిధిలోని జిల్లాల జాయింట్ కలెక్టర్లు వర్చువల్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

# ఖకిడ్నీ వ్యాధులు,అవయవ దానం పై అవగాహన ప్రచారం అవసరం



అవయవదానం పై ప్రజలకు తెలియజేయండి
విమ్స్‌లో జీవన్‌ధాన్ కిడ్నీ దినోత్సవం
ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ రవిరాజు,విమ్స్ డైరెక్టర్ కె రాంబాబు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, మార్చి12:** మనిషి యొక్క జీవనశైలి,ఇతర ఆహారపు అలవాట్ల కారణంగా అధికమవుతున్న కిడ్నీ వ్యాదులు.కిడ్నీ వ్యాధిగ్రస్తులు సంబంధిత వైద్యులను సంప్రదిస్తూ సకాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వీసీ, ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ టివి రవిరాజు అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం విమ్స్ ఆసుపత్రిలో రాష్ట్ర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు పర్యవేక్షణలో నగరంలోని పలు జీవన్‌ధాన్ పథకం అమలు చేస్తున్న ఆసుపత్రుల సీఈవ్లు, కో-ఆర్డినేటర్లు, ఇతర వైద్యసిబ్బందితో కలసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ టివి రవిరాజు మాట్లాడుతూ రోజురోజుకి పెరుగుతున్న కిడ్నీ వ్యాధి, వాటి నివారణ చర్యలపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.కిడ్ని ట్రాన్స్‌ఫ్లాంటేషన్ కోసం గతంలో చాలా మంది ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం జీవన్‌ధాన్ పథకం ఏపీలో పక్కగా అమలువుతున్న నేపథ్యంలో కొంత మేర కిడ్నీ రోగులకు సకాలంలో ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేస్తున్నారన్నారు. జీవన్‌ధాన్ పథకాన్ని దేశంలోనే టాప్ -6 లో నిలిపిన డాక్టర్ రాంబాబు సేవలను ప్రశంసించారు. ప్రపంచ దేశాల్లో 850 మిలియన్ ప్రజలు ప్రస్తుతం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, మన దేశంలో 115 మిలియన్ ప్రజలు బాధితులుగా ఉన్నారన్నారు.ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయువదానంపై ప్రజలకు అన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సైతం భాగస్వామ్యం చేస్తూ బ్రెయిన్‌డెడ్ అయిన రోగుల నుంచి అవయువాలను సేకరిస్తూ,కిడ్నీ ట్రాన్స్‌ఫ్లాంటేషన్లు చేస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా జీవన్‌ధాన్ పథకానికి సంబంధించి కూడా అన్ని రకాల సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్‌ఎం సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరిండింటెంట్ డాక్టర్ ఐ.వాణి,కిమ్స్ ఆసుపత్రి రీజనల్ హెడ్ నాగేశ్వరరావు,కేర్ ఆసుపత్రి సీఈవో సాదన్ కుమార్, అపోలో ఆసుపత్రి సీఈవో కృష్ణ ప్రసాద్, సివెన్‌హిల్స్ సీఈవో గిరిబాబు, మెడికవర్ ఆసుపత్రి సీఈవో నరేంద్ర బెండితో పాటు పలువురు నెఫ్రాలజిస్టులు, ఇతర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటీ కంపెనీల పేరిట విశాఖలో రూ.25 వేల కోట్ల భూదోపిడీ



మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపణ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 12** :విశాఖపట్నంలో ఐటీ కంపెనీల ఏర్పాటు పేరుతో గత రెండేళ్లలో దాదాపు రూ.25 వేల కోట్ల విలు వైన ప్రభుత్వ భూములు అక్రమంగా కేటాయిం చారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గుడివాడ అమ ర్నాథ్ ఆరోపించారు. ఐటీ కంపెనీల ముసుగు లో ఊరూపేరు లేని కంపెనీలకు ఎకరం భూమిని 99 పైసలకే కట్టబెట్టడం తీవ్ర అన్యాయమని ఆయన విమర్శించారు.విశాఖలోని పార్టీ సిటీ కార్యాలయంలో గురువారం మీడియాతో మా ట్లాడిన ఆయన, ఈ భూకేటాయింపుల్లో నిబం ధనలు ఉల్లంఘించారని తెలిపారు. ఈ అక్రమా లపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ భూముల ను రక్షించాలనే ఉద్దేశంతో తిరుపతి ఎంపీ మ ద్దెల గురుమూర్తి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారని చెప్పారు.ఐటీ రంగంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ కంపెనీ లకు కట్టబెట్టడం సరైంది కాదని అమర్నాథ్ అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి పెద్ద కంపెనీల పేరును ముందుంచి, వాటి ముసు గులో ఇతర కంపెనీలకు విలువైన భూములు అప్పగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ భూములకు వేలం నిర్వహిస్తే ఎకరం కనీసం రూ.50 కోట్ల వరకు ధర వచ్చే అవకాశం ఉన్నా, 99 పైసలకే కేటాయించడం ప్రభుత్వ విధానంపై అనుమానాలు కలిగిస్తోందన్నారు.పిల్ దాఖలు చేసిన తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభి వృద్ధికి వ్యతిరేకమని సోషల్ మీడియాలో తప్పు డు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించా రు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడాన్ని తమ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని, కానీ నిబం ధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను కేటాయించడం మాత్రమే ప్రశ్నిస్తున్నామని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ఐటీ పాలసీ పేరుతో విశాఖలో భారీ స్థాయిలో భూములు కేటాయిం చారని, కానీ ఇప్పటివరకు ఒక్క కంపెనీ కూడా కార్యకలాపాలు ప్రారంభించలేదని, ఒక్క ఉద్యో గం కూడా సృష్టించలేదని అమర్నాథ్ ఆరోపిం చారు. ఎన్నికల సమయంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీపై ప్రభు త్వం ఇప్పటివరకు ఎలాంటి పురోగతి చూపలేదని అన్నారు.గత రెండేళ్లలో రాష్ట్రానికి ఎన్ని కంపెనీలు వచ్చాయి, వాటి ద్వారా ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ఉచితంగా ఇవ్వ డం, రాయితీలు కల్పించడం, నిర్మాణ సహాయం చేయడం వంటి చర్యలతో ప్రభుత్వానికి ప్రయో జనం ఏమిటో కూడా ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు.ప్రభుత్వం ఎలాంటి తప్పు చేయక పోతే భయపడాల్సిన అవసరం లేదని, భూకేటా యింపులపై వచ్చిన ఆరోపణలను పారదర్శకం గా వివరించాలని ఆయన సూచించారు. ప్రజా ఆస్తులను రక్షించడం బాధ్యతగా ప్రతిపక్షంగా కోర్టుల ద్వారా పోరాటం కొనసాగిస్తామని అమర్నాథ్ తెలిపారు.



# విశాఖలో ఐటీ విస్తరణపై చర్చలు
## క్యాప్ జెమినీ సీఈవోతో
## మంత్రి నారా లోకేష్ భేటీ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 12** :రాష్ట్రంలో ఐటీ రంగ విస్తరణకు మరిన్ని పెట్టుబడులు ఆకర్షించే దిశగా రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సంస్థ సీఈవో తో విశాఖపట్నంలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఐటీ రంగ అభి వృద్ధి, పెట్టుబడుల అవకాశాలపై ఈ సమావేశం లో కీలక చర్చ జరిగింది.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయక త్వంలో ఐటీ, డేటా సెంటర్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. దేశంలోనే అతిపె ద్ద డేటా సెంటర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారం భం కానున్నాయని తెలిపారు. ఇప్పటికే , వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించాయని చెప్పారు.ఇంకా మూడు నెలల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో విశాఖకు ఐటీ రంగంలో మరింత ప్రాధాన్యం పెరుగుతుందని లోకేష్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విశా ఖలో సుమారు 20 వేల ఉద్యోగాలకు అవకాశం కలిగించే ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ (జీసీసీ), క్లౌడ్ సర్వీసెస్, బీపీఎం సేవల కేంద్రాలను ఏర్పాటు చేయాలని క్యాప్ జెమినీ సంస్థను కోరారు.అలాగే ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీ ల్యాబ్‌లను రాష్ట్ర విశ్వవిద్యాలయాలతో కలిసి ఏర్పాటు చేయాలని సూ చించారు. రాష్ట్రంలో ప్రతిపాదిస్తున్న "క్వాంటం వ్యాలీ" అభివృద్ధికి కూడా సంస్థ సహకరించా లని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో స్పందించిన క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఇజ్జత్ మాట్లాడుతూ, 1967లో పారిస్ కేంద్రంగా స్థాపితమైన తమ సంస్థ ప్రస్తుతం ప్ర పంచవ్యాప్తంగా 3.4 లక్షల మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నదన్నారు. ఇందు లో సుమారు రెండు లక్షల మంది ఉద్యోగులు భారత్‌లోనే పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తు తం హైదరాబాద్, చెన్నై, ముంబయి, పుణే, నోయిడా, కోల్‌కతా, గురుగ్రామ్, భువనేశ్వర్ సహా దేశంలోని 13 నగరాల నుంచి సంస్థ సే వలు అందిస్తున్నట్లు చెప్పారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులను పరిశీ లించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో క్యాప్ జెమినీ ఇండియా సీఈవో సంజయ్ చాకే, సీఈవో పాల్గొన్నారు. క్యాప్ జెమినీ సంస్థకు ప్రస్తుతం సుమారు 23.9 బిలియన్ డాలర్ల వార్షిక ఆదాయం ఉన్నట్లు వెల్లడించారు.




# విశాఖలో ఐటీ విస్తరణకు క్యాప్ జెమినీని ఆహ్వానించిన మంత్రి లోకేష్

**డెవలప్‌మెంట్ సెంటర్, జీసీసీ ఏర్పాటు చేయాలని సూచన**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 12** :విశాఖపట్నంలో ఐటీ రంగాన్ని మరింత విస్తరిం చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడు తోంది. ఈ క్రమంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రా నిక్స్ శాఖల మంత్రి గురువారం సంస్థ సీఈవో తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబ డులు, ఐటీ విస్తరణ అవకాశాలపై ఇద్దరూ చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో విశాఖపట్నం ఐటీ, డేటా సెంటర్ హబ్‌గా వే గంగా అభివృద్ధి చెందుతోందన్నారు. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌లలో ఒకటిగా భావిస్తున్న డేటా సెంటర్ పనులు త్వరలో ప్రారంభం కాను న్నాయని తెలిపారు. ఇప్పటికే , వంటి ప్రముఖ ఐటీ సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారం భించాయని చెప్పారు.మరో మూడు నెలల్లో ప్రారంభం కానుండటంతో విశాఖలో పెట్టుబ డులకు అనుకూల వాతావరణం మరింత బలో పేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యం లో విశాఖలో సుమారు 20 వేల ఉద్యోగాలు కల్పించే సామర్థ్యంతో ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ (జీసీసీ), క్లౌడ్ సర్వీసెస్, బీపీఎం సేవల కేంద్రాలను ఏర్పాటు చేయాలని క్యాప్ జెమినీని మంత్రి ఆహ్వానిం చారు.అదేవిధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ టెక్నాలజీలలో ఎమర్జింగ్ టెక్నాలజీ ల్యాబ్స్‌ను ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలతో కలిసి అభివృద్ధి చేయాల ని సూచించారు. రాష్ట్రంలో ప్రతిపాదిస్తున్న క్వాంటం వ్యాలీ అభివృద్ధికి కూడా సహకరిం చాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా స్పందించిన క్యాప్ జెమినీ సీఈవో ఐమాన్ ఇజ్జత్ మాట్లాడుతూ 1967లో పారిస్ కేంద్రంగా ప్రారంభమైన తమ సంస్థలో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 3.4 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. అందులో సుమారు రెండు లక్షల మంది భారత్‌లోనే పనిచేస్తున్నారని చెప్పారు. క్లౌడ్, డేటా & ఏఐ, డిజిటల్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో తమ సంస్థ సేవలు అందిస్తున్నద న్నారు.భారత్‌లో హైదరాబాద్, చెన్నై, ముం బయి, పుణే, నోయిడా, కోల్‌కతా, గురుగ్రామ్, భువనేశ్వర్ సహా 13 నగరాల్లో తమ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలి పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన లను పరిశీలిస్తామని ఐమాన్ ఇజ్జత్ వెల్లడిం చారు.

ఈ సమావేశంలో క్యాప్ జెమినీ ఇండియా సీఈవో సంజయ్ చాకే, డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సీఈవో కేశవ్ మురుగేష్ పాల్గొన్నారు.



కాగా క్యాప్ జెమినీ సంస్థ వార్షికంగా సుమారు 23.9 బిలియన్ డాలర్ల ఆదాయం సాధిస్తోంది.

పెన్ పవర్ శుక్రవారం 13 మార్చ్ 2026

## ఐఐఐటి నూతన సంచాలకులుగా అమరేంద్ర కుమార్ బాధ్యతల స్వీకారం





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 12:** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటి) నూతన సంచాలకులుగా ప్రొఫెసర్ సంద్ర అమరేంద్ర కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ గా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించారు. తరగతుల నిర్వహణలో మెరుగుదల, విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాల పెంపునకు ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దుతామని అమరేంద్ర కుమార్ పేర్కొన్నారు.

ముఖ్యంగా విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారిముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఆర్థిక అధికారి వాసు, రెండో ప్రాంగణ పర్యవేక్షకులు సాగర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్

- జిల్లాలో 11,602 కేసులు గుర్తింపు
- జిల్లాలో 20 బెంచ్ లు ఏర్పాటు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి12:** జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, జాతీయ లోక్ అదాలత్ కు సంబంధించి జిల్లాలో 11,602 కేసులు గుర్తించడమైనదని, జిల్లా మొత్తం మీద 20 బెంచ్ లు ఏర్పాటు చేయగా జిల్లా కేంద్రంలో 4 బెంచ్ లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ లోక్ అదాలత్ లో రాజీపడదగ్గ కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవచ్చన్నారు. సివిల్, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ వలన ఉపయోగాలు

ఈ లోక్ అదాలత్ వలన సమయం, ధనం వృథా కాకుండా ఉంటుందని చెప్పారు. సివిల్ కేసులు రాజీ అయితే మొదట చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి చెల్లిస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న కక్షిదారులు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## దారకొండలో వైఎస్ఆర్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ






**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి12:** జీకే వీధి మండలంలోని దారకొండ పంచాయతీలో 16వ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దారకొండ పంచాయతీ వైసీపీ కమిటీ అధ్యక్షులు పిల్ల సత్యనారాయణ (బుజ్జి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు వైసీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ స్థాపన దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో దారకొండ ఎంపీటీసీ మాడి రామన్న, గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ, నాయకులు జి. రామయ్య, ఆర్. మోహన్‌రావు, పి. జగన్నాథం, వి. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో ఉన్న బాలింతలకు బ్రెడ్ మరియు పండ్లను పంపిణీ చేసి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితురాలకీ సహాయం చేసిన డాక్టర్ బొత్స అనూష



**గరివిడి పెన్ పవర్ మార్చి 12.** గరివిడి మండలం బొండపల్లి గ్రామానికి చెందిన దుడుమూరు మహాలక్ష్మి (50)గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని తెలుసుకొని ఆమెకు 3 నెలలు సరిపడా నిత్యవసర సరుకులును ఈ రోజు గరివిడి క్యాంపు కార్యాలయంలో వాళ్ళ కుమారుడుకి అందజేసిన యువ నాయకురాలు శ్రీమతి డాక్టర్ బొత్స అనూష

వారి యొక్క కుమారుడు మాట్లాడుతూ తమ యొక్క కుటుంబంను కష్టకాలంలో ఆదుకున్న శ్రీమతి డాక్టర్ బొత్స అనూష సహాయాన్ని ఎప్పటికీ మరువలేమని తమకు చేసిన సహాయానికి వారి కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైఎస్సార్‌సీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో డాక్టర్ బొత్స అనూష,

**క్యాడర్‌లో జోష్ నింపిన డాక్టర్ బొత్స అనూష!**

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 12:-**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చీపురుపల్లి నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో జరిగాయి. మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తనయరాలు, యువ నాయకురాలు డాక్టర్ బొత్స అనూష ఆధ్వర్యంలో గురువారం గుర్ల, చీపురుపల్లి మరియు గరివిడి పట్టణాల్లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లన చంద్రశేఖర్,చీపురుపల్లి నియోజకవర్గం పరిశీలకులు పెరడా రమణి కుమారి,రాష్ట్ర మహిళా కార్యదర్శి కొయ్యన శ్రీవాణి పార్టీ ముఖ్య నాయకులు, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం గరివిడి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ అనూష పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో నాయకులు ఉద్వేగభరితమైన ప్రసంగాలతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

**ప్రజల గుండెల్లో వైఎస్సార్.. కార్యకర్తలే పార్టీకి కొండంత అండ,డాక్టర్ బొత్స అనూష,**

సభను ఉద్దేశించి ప్రధాన వక్తగా డాక్టర్ బొత్స అనూష గంభీరంగా ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ.. "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు, అది కోట్ల మంది పేదల ఆశల రూపం. నాన్నగారు (బొత్స సత్యనారాయణ) ఎప్పుడూ చెప్పే మాట ఒక్కటే.. కార్యకర్తలే పార్టీకి అసలైన బలం. ఈ 16 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా, మొక్కవోని ధైర్యంతో నిలబడిన ప్రతి కార్యకర్తకు నా సెల్యూట్. రాజన్న ఆశయాలను, జగనన్న సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత ముందుండాలి. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తాం. మీ అందరికీ తోడుగా, అండగా నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని పిలుపునిచ్చారు. ఆమె ప్రసంగం అంతటా కార్యకర్తల కరతాళ ధ్వనులతో సభ హోరెత్తింది.మాజీ ఎంపీ బెల్లన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం ఒక చరిత్ర అని, నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు నాయకులంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడడమే మన లక్ష్యమని స్పష్టం చేశారు.చీపురుపల్లి నియోజకవర్గ పరిశీలకులు పెరడా రమణి కుమారి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, డాక్టర్ అనూష వంటి యువ నాయకత్వం రావడం నియోజకవర్గానికి గర్వకారణమని కొనియాడారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి కొయ్యన శ్రీవాణి మాట్లాడుతూ.. సామాన్యుడికి న్యాయం చేసే పార్టీ వైఎస్సార్‌సీపీ అని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంత్, గరివిడి ఎంపీపీ ప్రతినిధి మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొనిసి కృష్ణం నాయుడు, గుర్ల ఎంపీపీ ప్రతినిధి సన్యాసి నాయుడు, జడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసరావు, చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాలు నాయుడు, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## దేవరపల్లి భూమి వివాదంపై ఎంఎల్‌సీసీ సమావేశం

- వివాదాస్పద భూమిపై సర్వేకు ఆదేశం
- వచ్చే వారం మళ్లీ విచారణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి12:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి గ్రామానికి సంబంధించిన భూమి వివాదంపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు ఆధ్వర్యంలో మండల స్థాయి కోఆర్డినేషన్ కమిటీ (ఎంఎల్‌సీసీ) సమావేశం నిర్వహించారు. కిల్లో దానుర్జయ్, కొర్ర భగీరథి, కిల్లో దనేష్ మధ్య ఉన్న భూమి వివాదంపై ఇరుపక్షాల వాదనలు అధికారులు వినిపించారు. సమావేశానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎంపీడీఓ బిహెచ్‌వి రమణబాబు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ బుజ్జిబాబు, మొట్టడం రాజుబాబు తదితర గ్రామ పెద్దలు కూడా పాల్గొన్నారు. చర్చల అనంతరం వివాదాస్పద భూమిపై అధికారిక సర్వే నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. సర్వే నివేదిక ఆధారంగా కేసును వచ్చే వారం మళ్లీ విచారణకు పెట్టనున్నట్లు తెలిపారు. గ్రామ పెద్దలు సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు. అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పెదవలసలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మార్చి 12:**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ వసంతాలు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా గూడెం కొత్తవీధి మండలం పెదవలస గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం వేడుకలు నిర్వహించారు.వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు కార్యక్రమాలు చేపట్టారు.పెదవలస గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఉదయం పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, పాడేరు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు లమ్మసింగి రమేష్ ఆధ్వర్యం వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగ అధ్యక్షుడు వసుపరి తిమోతి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, దేశెట్టి రాంబాబు, కంకిపాటి శ్రీరాములు, రాట కన్నబాబు, కంకిపాటి బాలరాజు, గబులంగి బుజ్జిదొర, కంకిపాటి శరభన్నపడాల్, కంకిపాటి శంకర్‌రావు, వంతల ఆనంద్, గబులంగి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గ్యాస్ వినియోగదారులకు ఆందోళన వద్దు

- జిల్లాలో ఎటువంటి గ్యాస్ కొరత లేదు... తగినన్ని నిల్వలు ఉన్నాయి
- జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 12 :** జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, జిల్లాలో గ్యాస్ కొరత లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో గ్యాస్ కొరత ఏర్పడుతుందనే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. గ్యాస్ దొరకదనే అపనమ్మకంతో ఖంగారు పడి సిలిండర్ ఖాళీ కాకుండానే ముందస్తుగా బుక్ చేస్తున్నారని, ఖాళీ సిలిండర్ ఇస్తేనే కొత్తది సరఫరా చేయడం జరుగుతుందని జేసీ తేల్చి చెప్పారు. గురువారం ఆయన జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీలను ఆకస్మికంగా తనిఖీ చేసి, నిల్వలు మరియు పంపిణీ తీరును పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలను జేసీ, సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు గ్యాస్ నిల్వలు, పంపిణీ తీరును పరిశీలించినట్లు జెసి చెప్పారు. జిల్లాలో వంట గ్యాస్ సరఫరా సాధారణంగానే ఉందని, ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని అన్నారు. గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, జిల్లాలోని 15 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సుమారు 1.20 లక్షల మంది వినియోగదారులకు గ్యాస్ అందుతోందని వివరించారు. ప్రస్తుతం గోడౌన్లలో 9,000 పైచిలుకు సిలిండర్ల నిల్వలు ఉన్నాయని, విశాఖపట్నంలోని బాట్లింగ్ ప్లాంట్ల నుండి ప్రతిరోజూ జిల్లాకు గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నట్లు పేర్కొన్నారు.రోజువారీగా 3 నుండి 4 వేల బుకింగ్లు సజావుగా జరుగుతున్నాయని, అయితే యుద్ధ వాతావరణం వలన గ్యాస్ కొరత ఉండవచ్చనే అపోహతో దాదాపు 80 శాతం బుకింగ్స్ పెరిగినట్లు జేసీ తెలిపారు.

**ప్రభుత్వం తరపున గ్యాస్ వినియోగదారులకు విజ్ఞప్తి**

గ్యాస్‌లో ఎటువంటి కొరతా లేదని, ఇంతకుముందు ఏ విధంగా సరఫరా అయిందో, ప్రస్తుతం కూడా అదేవిధంగా సరఫరా చేసేందుకు యంత్రాంగం మొత్తం సమాయత్తమై ఉందన్నారు. దయచేసి ఎటువంటి అపోహలకు గురికావద్దని, అవసరం లేకపోయినా కూడా గ్యాస్ మీరు బుక్ చేసుకొని కృత్రిమ కొరత సృష్టించడంలో పాల్పంచుకోవద్దని జేసీ విజ్ఞప్తి చేశారు.

**గ్యాస్ ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్**

గ్యాస్ సరఫరాలో ఫిర్యాదుల కొరకు జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలు వసూలు, బుకింగ్ చేసినా సరఫరా చేయక పోవడం వంటి సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 70130 60665 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా సమస్యను పరిష్కరించి, తీసుకున్న చర్యలను వినియోగదారులకు తెలియజేస్తామని జెసి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ఘనంగా గరుడాద్రి శ్రీవారి బ్రహ్మోత్సవాలు





**గాజువాకపెన్ పవర్ ,మార్చి 12 :** జీవీఎంసీ 65 వ వార్డ్ భోనోజి తోట వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు రెండవ రోజు స్వామివారికి ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో వేద పండితులు శ్రీమాన్ బాలాజీ బట్టాచార్య స్వామి శ్రీరంగం వారిచే యాగశాల ప్రవేశం, భగవత్ భగవత్ పుణ్యా వచనం, మృత్ సంగ్రహనం , అంకురార్పణ, కుంభ పూజ, కుంభ మండలం, బిం బ పూజ, అష్టాక్షరి యాగం, మహాలక్ష్మి అర్చన, జపం, పారాయణం, యజ్ఞం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు . కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓం భారత్ శక్తిపీఠ వ్యవస్థాపకుడు హిందూ మహాసభ, దక్షిణ భారత ఆర్గనైజర్ సెక్రెటరీ గురూజీ భగవతానంద్ మహారాజ్ పూజా కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు చేశారు . ఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం ఇది రెండవది మంచి విశిష్టత కలిగిన ఆలయంగా ప్రసిద్ధి చెందుతుందని అన్నారు. మరో మూడు రోజులు బ్రహ్మోత్సవాలు కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అవుతారని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్ నాయక్ నేషనల్ వైస్ చైర్మన్ హ్యూమన్ రైట్స్ ,న్యాయ వాది పెంటకోట నాగేశ్వరరావు, పెంటకోట రాజు, పూడి శాంతి, తిప్పల స్వాతి, పప్పల ఆదిలక్ష్మి, కె జానకి, జుత్తుల లక్ష్మి, లాభాల దుర్గాప్రసాద్ ,భవాని, ఆలయ ప్రధాన అర్చకులు మాధవాచార్యులు, రమణ మరియు ఆలయ సేవకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వార్డ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంఎల్ఏ :పల్లా





**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 12 :**వి.ఎం.ఆర్.డి.ఏ ఇంజనీరింగ్ అధికారులు ఆధ్వర్యంలో వుడా130 ఫీట్ రోడ్డు లో సెంటర్ ఐలాండ్ లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించి

సంతృప్తిని వ్యక్తం చేసి అధికారులకు తదుపరి పనులపై పలు సూచనలు చేయడం జరిగింది. అభివృద్ధి జరుగుతున్న 9 విభాగ్నిలో చిల్డ్రన్ పార్క్ లో. వాకింగ్ ట్రాక్లు. కార్ పార్కింగ్ . క్రీడాకారులకు సౌకర్యార్థం నట్ గేమ్స్. ఓపెన్ ఏర్పాటు చేయాలని. సాధ్యమైనంత త్వరలోనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వి ఎం ఆర్ డి ఏ సహకారంతో సమతా నగర్ కళాపరంగాన్ని ఏసీ ఆడిటోరియంలో అన్నారు 74 వ వార్డు దయాల్ నగర్ కొండపై ఆహ్లాదకరమైన పార్క్ ని ఏర్పాటు చేయాలని కోరారు. గొంతిన పాలెంఆదర్శ స్టేడియం అభివృద్ధి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఇంజనీరింగ్ అధికారులు మరియు నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ 73వ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సింగూరి అనంత్, 73వ జనసేన ఇన్చార్జ్ రౌతు గోవిందరావు ,73వ క్లస్టర్ ఇంచార్జ్ బలగ బాలు నాయుడు, ప్రధాన కార్యదర్శి పెద్దదేముడు, టిడిపి నాయకులు జాజులు గంగరాజు, దొడ్డి వెంకట అప్పారావు, బంటుపల్లి ప్రసాద్ తదితరులు పాలుగొన్నారు .

## ఆర్ వి నగర్‌లో కొత్త మంచినీటి కుండీ ప్రారంభం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మార్చి 12:** గూడెం కొత్తవీధి మండలం ఆర్ వి నగర్ గ్రామంలో పంచాయితీ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం కింద గ్రామస్థులకు స్వచ్ఛమైన నీటి అందుబాటును కల్పించేందుకు ఏర్పాటు చేసిన మంచినీటి కుండీను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ కోర్ర సుభద్ర మరియు ఎంపీటీసీ రాజులమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు అరికట్ల ఆంజనేయులు (అంజి), ఉప సర్పంచ్ రాంబాబు, పిసా గ్రామ కమిటీ సభ్యుడు నీలకంఠం, అలాగే నాయకులు కృపా, గ్రామస్తులు శాంతి రాజు, నాగేష్, ధారబాబు, రాజారావు, నాయుడు నాగేశ్వరరావు, గ్రామ మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్ర సుభద్ర మాట్లాడుతూ, "గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించడం మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# పైడిపాలలో 120 కిలోల గంజాయి పట్టివేత



**నర్సీపట్నం, పెన్ పవర్ (మార్చి 12) :**మాకవరపాలెం మండలం పైడిపాల జంక్షన్ వద్ద మినీ ట్రక్ లో తరలిస్తున్న 120 కేజీల గంజాయిని మాకవరపాలెం పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను మాకవరపాలెం పోలీస్ స్టేషన్లో డి.ఎస్.పి పి.శ్రీనివాసరావు మీడియాకు వివరించారు. మాకవరపాలెం ఎస్సై దివాకర్ కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పైడిపాల జంక్షన్ వద్ద గురువారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. ముందుగా పైలట్ గా వ్యవహరిస్తూ బైక్ పై వచ్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత మినీ ట్రక్లో తనిఖీ చేయగా 120 కేజీల గంజాయి దొరికింది ఆ వాహనంలోని ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారని డిఎస్పి తెలిపారు. మొత్తం నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, బైకు, మినీ ట్రక్కు, నాలుగు స్మార్ట్ ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో కొప్పి సత్తిబాబు, పైల సురేష్, పరవాడ శ్రీనివాసరావు, కర్రీ కృష్ణ ఉన్నారని, పరారైన ముగ్గురు నడిపింటి సతీష్, కోలా రామకృష్ణ, మాకిరెడ్డి సాయికుమార్ లుగా పేర్కొన్నారు. వీరందరి పైన పోలీస్ స్టేషన్లో గంజాయి కేసులు నమోదై ఉన్నాయని డిఎస్పి తెలిపారు. పలుమార్లు గంజాయి కేసులలో ఉంటే వారిపై పిడి యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి కి సంబంధించిన సమాచారం పోలీసులకు అందించొచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని డిఎస్పి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. పట్టుబడ్డ గంజాయిని, స్మగ్లర్లను మీడియా ముందు ఉంచారు. ఈ మీడియా సమావేశంలో నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దివాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సీపట్నంలో అట్టహాసంగా అమ్మవారి విగ్రహప్రతిష్ఠ






**-పాల్గొన్న స్పీకర్ అయ్యన్న కుటుంబం**

**నర్సీపట్నం, పెన్ పవర్ (మార్చి 12) :**నర్సీపట్నంలో శ్రీనూకాలమ్మ అమ్మవారి నూతన ఆలయ ప్రారంభోత్సవం మరియు విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు మూడు రోజుల పాటు కన్నుల పండువగా జరిగాయి. గురువారం నాడు జరిగిన ఈ ముగింపు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా సాగాయి. దాండియా, డప్పు చప్పుళ్లు, కోలాటాల నడుమ యాగశాల నుండి అమ్మవారి నూతన ఆలయం వద్దకు జరిగిన ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పవిత్ర కార్యక్రమంలో శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, డాక్టర్ సువర్ణ దంపతులు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్, దివ్యశ్రీ దంపతులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 9.14 నిమిషాలకు యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు వేదమంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా పూర్తయ్యాయి. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నర్సీపట్నం ప్రజలకు శ్రీనూకాలమ్మ అమ్మవారు ఇలవేల్పు అని, మూడురోజుల పాటు నిష్ణాతులైన పండితులతో హోమాలు ఎంతో ఘనంగా నిర్వహించామని తెలిపారు. అలాగే ముందురోజు వేలాది మంది మహిళలు కలశాలతో పసుపు నీళ్లు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించిన ఘట్టం అత్యంత వైభవంగా జరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నేటి నుంచే జాగారాలు మొదలవుతున్నాయని, రాబోయే కొత్తఅమావాస్య నూకాలమ్మ పండుగకు భక్తులంతా తరలివచ్చి ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

ఈ ఏడాది అంగరంగ వైభవంగా మరిడమ్మ జాతర : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అంతేకాకుండా ఈనెల 31 న జాగరణ, ఏప్రిల్ 1వ తేదీన మరిడమ్మ జాతర జరుపనున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. ఈ వేడుకకు దూర ప్రాంతాలలో ఉన్న బంధువులు, చుట్టాలు, అన్నదమ్ములను ఆహ్వానించి పిల్లపాపలతో కలసి ఎంతో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నర్సీపట్నంలో రెండురోజుల పాటు జరిగే భారీ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.





## గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలి..

- గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 12 :** విజయనగరం జిల్లాలో నూతనంగా ఒక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

విజయనగరం జిల్లాలో ప్రస్తుతం 8 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉండగా, వీటిలో నేరెల్లవలస, ఆంధ్ర, తాడిపూడి, కొండ గంగు పూడి, శృంగవరపుకోట, నెల్లిమరలో ఆరు బాలుర ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని, బొబ్బిలి, విజయనగరంలో రెండు బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని రంజిత్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ చేపడుతున్న "రేషనలైజేషన్"ప్రక్రియలో భాగంగా విజయనగరం జిల్లాలో నూతనంగా ఒక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. నూతన పాఠశాల ఏర్పాటు చేయలేని పరిస్థితిలో ఉంటే, తాడిపూడి, ఆంధ్ర, శృంగవరపుకోట బాలుర ఆశ్రమ పాఠశాలల్లో ఎదో ఒక పాఠశాలను గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలగా మార్పు చేయాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

## నేడు సుకూరు సచివాలయాన్ని ప్రారంభించబోతున్న అరకు ఎమ్మెల్యే. రేగం మత్స్యలింగం



**హుకుంపేట పెన్ పవర్ మార్చి 12 :**అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం

ఈ రోజు ఉదయం 10 గంటలకు సుకూరు గ్రామ పంచాయతీ గ్రామ సచివాలయాన్ని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్యఅతిథిగా పాల్గొని సచివాలయాన్ని ప్రారంభిస్తారని వైఎస్ఆర్ సీపీ మండల శ్రేణులు తెలియజేశారు హుకుంపేట మండలానికి చెందిన, పార్టీ అధ్యక్షుడు,ఎంపీపీ,వైస్ ఎంపీపీలు,సర్పంచులు,ఎంపీటీసీలు,వార్డు మెంబర్లు,మండల మరియు గ్రామ పంచాయతీ వైయస్సార్ కమిటీ నాయకులు,సభ్యులు, కార్యకర్తలు మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,వైసిపి సీనియర్ నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు

# జీకే వీధిలో ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 12**: గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో వైసిపి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి బాబు సారధ్యం లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.వేడుకల్లో సభను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ, "జగన్ మోహన్ రెడ్డి పార్టీని స్థాపించి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో ప్రతిష్టాత్మక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసిన ఘనత ఆయనకు ఉంది. రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి మళ్లీ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడం అత్యవసరం" అని పేర్కొన్నారు. "పార్టీలో ఎవరికైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే మాకు తెలియజేస్తే, అవి వెంటనే పరిష్కరించబడతాయి. రాబోయే స్థానిక ఎన్నికల్లో మన మండలం ఐక్యంగా పనిచేసి అత్యధిక స్థానాలను గెలుచుకుని, అల్లూరి జిల్లా అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు బహుమతి ఇవ్వాలి" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ లోత దేముడు, జీకే వీధి స్థానిక సర్పంచ్ కొర్ర సుభద్ర, రింతాడా సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, లక్కవరపు పేట సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్, దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ, ఎంపీటీసీలు కొర్ర రాజులమ్మ, మొట్టడం సత్యనారాయణ, పోతురాజు కృష్ణమూర్తి, జీకే ఉప సర్పంచ్ కొర్ర రాంబాబు, మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్, రాష్ట్ర పంచాయితీ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్,మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ, మండల సోషల్ మీడియా అధ్యక్షులు పాతూను లక్ష్మన్, జీకే వీధి పంచాయితీ పార్టీ అధ్యక్షులు కొర్ర నూకరాజు, వార్డ్ సభ్యులు నాయకులు బోయిన వెంకట్ మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**నర్సీపట్నం, పెన్ పవర్ ( మార్చి 12) :**నర్సీపట్నంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతోపాటు, మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ఈ వేడుకలలో ముందుగా స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తరువాత నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి మాజీ ఎమ్మెల్యే గణేష్ కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఢిల్లీ పెద్దలను ఎదిరించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి నేటికీ 15 సంవత్సరాలు పూర్తయిందని అన్నారు. తన తండ్రి మరణంతో గుండె ఆగిన ఎన్నో కుటుంబాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓదార్పు యాత్ర ద్వారా కలిశారన్నారు. 2014 ప్రభుత్వంలో ప్రతిపక్ష పాత్ర సమర్ధవంతంగా పోషించారని కొనియాడారు. తరువాత రాష్ట్రమంతా 3480 కిలోమీటర్లు పాదయాత్ర చేసి పేద ప్రజల కష్టాలను తెలుసుకున్నారని అన్నారు. 2019లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి తన సమర్ధతను చాటుకున్నారని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. గత ఎన్నికల్లో కూటమి నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని, అందుకే పార్టీ ఓటమి పాలైందని వివరించారు. మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే వరకు, వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూసేవరకు కార్యకర్తలు అందరూ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు.

# ముంచంగిపుట్టులో ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.





- కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు.
- కులాల మతాల మధ్య చిచ్చురేపుతూ రాష్ట్రంలో ఆశాంతి అలజడి సృష్టిస్తుంది.
- 2029లో రాష్ట్రంలో అధికారంలోకి రావటమే లక్ష్యం.
- ఉమ్మడి విశాఖ జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర.
- పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 12.**అల్లూరి సీతారామరాజు జిల్లా ముచ్చంగిపుట్టు మండల కేంద్రంలో వైసిపి 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ జల్లిపల్లి సుభద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె వైసిపి శ్రేణులు అందరితో కలిసి వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సుభద్ర మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి సంక్షేమం వైపు నడిపించారని, కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. కులాల మతాల మధ్య చిచ్చురేపుతూ రాష్ట్రంలో ఆశాంతి, అలజడి సృష్టిస్తుందన్నారు. వైద్య కళాశాల ప్రైవేటు కరణను కప్పిపుచ్చుకోవడానికే తిరుపతి కల్తీ లడ్డు వ్యవహారం బయటకు తీసుకు వచ్చింది అని ప్రభుత్వంపై మండపడ్డారు. 2029లో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏర్పడుతుందని, ఈ సందర్భంగా ప్రజలకు 16వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. తదనంతరం పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఆనాడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, బడుగు బలహీన వర్గాలకు బాసటగా నిలవాలని ఉద్దేశంతో వైసిపి పార్టీని వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థాపించారని అన్నారు. దేశంలో విద్య, వైద్యం, వ్యవసాయంపై ఎన్నో సంఘ సంస్కరణలు తీసుకోవచ్చి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారని, అటువంటి గొప్ప నేత జగన్మోహన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయం, అక్రమం రాజ్యమేలుతుందని, 2029 ఎన్నికల్లో జగన్ ను ముఖ్యమంత్రిగా చేయడానికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు జగన్నాన తోనే న్యాయం జరుగుతుందని, సాధారణ మహిళ అయిన తనకు ఉన్నత స్థానం కట్టబెట్టారని అన్నారు. తదనంతరం వైసిపి శ్రేణులు అందరు కలిసి కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ జగబంధు, సీనియర్ నేతలు మూర్తి, మత్స్యలింగం, గాసిరం, వైసీపీ సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మనోబందు కార్యక్రమాలు చర్చించిన కమిషనర్

- మానసిక ఆరోగ్యం గురించి అవగాహన అవసరం
- కేతన్ గార్గ్, మున్సిపల్ కమిషనర్, జి విఎంసి



**విశాఖ మార్చ్ 12(పెన్ పవర్):**మనోబందు ఫౌండేషన్ భవిష్యత్తు కార్యక్రమాలు గురించి మహా విశాఖ మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ భూపతిరాజు రామకృష్ణ రాజు తో చర్చించారు. గురువారం సాయంత్రం సిరిపురం జంక్షన్ లో విఎం ఆర్ డి ఎ చిల్డ్రన్ ఎరీనా లో కొద్ది సేపు చర్చించారు. ఆంధ్రా", తెలంగాణా రాష్ట్రాలలో గడిచిన నాలుగు ఏళ్ళుగా నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. ఈ అంశం మీద కమిషనర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం గురించి అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం అన్నారు. మనోబందు ఫౌండేషన్ భవిష్యత్తు కార్యక్రమాలకు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. చాలామంది బాధ పడుతున్న వారికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.

ఈ కార్యక్రమంలో రాచకొండ చారిటబుల్ సంస్థ అధ్యక్షులు రాచకొండ దశరధ రామయ్య , గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# సానిటేషన్ కార్మికులకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం

**విశాఖ తూర్పు మార్చ్ 12 (పెన్ పవర్)**

తూర్పు నియోజకవర్గంలోని 19 మరియు 20వ వార్డుల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సానిటేషన్ కార్మికులకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జివిఎంసి అధికారుల ఆహ్వానం మేరకు రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్, 35వ వార్డు అధ్యక్షుడు బుచ్చ రాము రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్, ఉత్తరాంధ్ర మహిళల సమన్వయకర్త ఎం నాగలక్ష్మి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సానిటేషన్ కార్మికులు తమ విధులు నిర్వహించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పని చేసే విధి విధానాలపై వారికి అవగాహన కల్పించారు.



ఈ కార్యక్రమంలో నెల్లి కనకరాజు, గణేష్, విజయకుమార్, 19వ వార్డు తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు పోలా రావు, జనసేన వార్డు అధ్యక్షుడు పరదేశి, 20వ వార్డు జనసేన అధ్యక్షుడు రాధే శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# దామనపల్లిలో ఆధార్ సేవలు ప్రారంభం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి12**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి గ్రామ సచివాలయంలో గురువారం ఆధార్ సేవలను ప్రారంభించారు.ఈ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఆధార్ వివరాల నవీకరణ, మొబైల్ నంబర్ అనుసంధానం మరియు ఇతర ఆధార్ సంబంధిత సేవలను ఇకపై గ్రామ సచివాలయంలోనే పొందవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై వార్డు సభ్యులతో కలిసి తీర్మానాలు చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఉప సర్పంచ్ చిలకమ్మ, వార్డు సభ్యులు మోహన్ రావు, కృష్ణ ఇతర వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాటు కోళ్ల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు.

**పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ లోకుల రమేష్.**

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 12.** వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా నాటు కోళ్ల పెంపకాన్ని చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చునని పశుసంవర్ధక శాఖ చింతపల్లి ఇన్చార్జి సహాయ సంచాలకులు డాక్టర్ లోకుల రమేష్ అన్నారు. గురువారం చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో సబ్ డివిజన్ పరిధిలోని ఎంపిక చేసిన గిరిజన రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలకు సంబంధించి రైతులకు తెలియజేశారు. ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా పంపిణీ చేసిన కోడి పిల్లల సంరక్షణ వాటి వల్ల కలిగే అదనపు ఆదాయ మార్గాలను ఆయన రైతులకు వివరించారు. తక్కువ స్థలంలోని నాటు కోళ్లను రైతులు పెంపకం చేపట్టవచ్చునని వాటికి కావలసినటువంటి సంస్థ విధములైన మార్గాలను పశు సంవర్ధక శాఖ తీసుకుంటుందన్నారు. రైతులు వ్యవసాయ పనుల సాగుతో పాటు అనుబంధ పరిశ్రమగా నాటు కోళ్ల పెంపకం చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. దీని ద్వారా రైతుల ఆర్థిక పురోగతి పెంపొందించి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ సమావేశంలో చింతపల్లి లోతు గడ్డ పశు వైద్యాధికారులు డాక్టర్ సౌజన్య ,డాక్టర్ శాలిని, చింతపల్లి, గూడెం కొత్త వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన సిబ్బంది రైతులు పాల్గొన్నారు.





# కష్టకాలంలో మేము సైతం .......

- బ్రెయిన్ డెడ్ అయి చికిత్స పొందుతున్న వ్యక్తి ఏ నెగటివ్ రక్త దానం చేసిన యువత




**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 12** పారిశ్రామిక ప్రాంతం గాజువాక లో కష్టకాలంలో రక్తం దానం చేసేందుకు నేటి యువత ఎక్కువగా ముందుకు రావడం విశేషం . గాజువాక ప్రాంతానికి చెందిన వ్యక్తి బ్రెయిన్ డెడ్ ఆపరేషన్ నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీను తన అనుచరగణం తో కలిసి రక్తం అమ్మ బ్లడ్ బ్యాంకులో అందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ రక్త దానం చేయడం వలన ఆపదలో ఉన్న ఎంతో మందికి ప్రాణ దాతలు అవుతామని అన్నారు. యువత ప్రతీ ఒక్కరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదానకార్యక్రమంలో నలుగురు యువకులు మోహన్ బాబు, సుదమల్ల శ్రీను ,వి రాజు, రవికుమార్ తదితరులు ముందుకు వచ్చి ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచారు.

# జిల్లాలో పలు రైళ్ళకు హాల్ట్ మంజూరు



CC- 95/2026

भारत सरकार/GOVERNMENT OF INDIA
रेल मंत्रालय/ MINISTRY OF RAILWAYS
रेलवे बोर्ड (RAILWAY BOARD)

POST COPY
ISSUED ON 12.03.2026

| THE GENERAL MANAGERs (OPTG.) | COPY TO: CPTMs |
|---|---|
| ECOR/BHUBANESWAR | ECOR/BHUBANESWAR |
| SER/KOLKATA | SER/KOLKATA |

NO. 2025/CHG/13/ECOR/105 (.) MINISTRY OF RAILWAYS DESIRES THAT STOPPAGE OF THE FOLLOWING TRAIN(S) SHOULD BE PROVIDED ON AN EXPERIMENTAL BASIS AT THE STATION(S) AND WITH EFFECT FROM THE DATE(S) INDICATED ALONGSIDE (.)

| SL | TRAIN NO. AND NAME | STATION | W.E.F. |
|---|---|---|---|
| 1. | 58505/58506 GUNUPUR-VISAKHAPATNAM- PASSENGER | HARISCHANDRA PURAM | EARLY CONVENIENT DATE |
| 2. | 18525/18526 BRAHMAPUR-VISAKHAPATNAM EXPRESS | MANDASA ROAD | EARLY CONVENIENT DATE |
| 3. | 18117/18118 ROURKELA-GUNUPUR RAJYA RANI EXPRESS | PATAPATNAM | EARLY CONVENIENT DATE |

A CLOSE WATCH SHOULD BE KEPT AT THE SALE OF TICKETS AT THE STATION FOR REVIEW (.) GIVE WIDE PUBLICITY (.) ENSURE COMPLIANCE AND CONFIRM (.)

PARSURAMKA/RAILWAYS (.)

12.03.26
(राजेश कुमार)
(RAJESH KUMAR)
संयुक्त निदेशक (कोचिंग)
JOINT DIRECTOR (COACHING)
रेलवे बोर्ड/RAILWAY BOARD

COPY TO:
1. EDPM IN BOARD'S OFFICE.
2. CMD/IRCTC, NEW DELHI.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 12 :** శ్రీకాకుళం జిల్లా వాసులు చిరకాల కోరికను కేంద్ర మంత్రి చొరవతో పలు రైళ్ళకు కీలక స్టేషన్లలో హాల్ట్ కల్పించారు. దీంతో జిల్లా ప్రజలు ఎంతోకాలంగా చేసిన ప్రయత్నాల చివరకు ఫలితం లభించింది. శ్రీకాకుళం జిల్లా మీదుగా ప్రయాణించే మూడు ముఖ్యమైన రైళ్లకు జిల్లాలోని మూడు స్టేషన్లలో రైల్వే శాఖ హాల్ట్ లు మంజూరు చేశారు. 58505/06 గుణుపూర్విశాఖపట్నం ప్యాసింజర్ రైలును హరిశ్చంద్రపురం వద్ద ఆగనుంది. 18525/26 బెరహంపూర్విశాఖపట్నం ఎక్స్ప్రెస్ రైలు మందస రోడ్ వద్ద హాల్ట్ కల్పించగా 18117/18 రాజ్య రాణి ఎక్స్ప్రెస్ రైలు పాతపట్నం వద్ద ఆగనున్నాయి. ఈ హాల్ట్ ల ద్వారా జిల్లాలోని అంతర్గత ప్రాంతాలకు రవాణా సౌకర్యం మరియు విశాఖపట్నం వంటి ప్రధాన పట్టణాలకు విద్య, వైద్యం, ఉపాధి మరియు వ్యాపార అవసరాల కోసం ప్రయాణం మరింత సులభమవుతుంది.

కొత్త స్టాపేజీల ద్వారా జిల్లాలో మెరుగైన రైల్వే కనెక్టివిటీతో పాటు ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి కొత్త అవకాశాలను తీసుకురానుంది.

# నెక్స్ట్-జెనరేషన్ ఆటోమేషన్ పై వర్క్‌షాప్ విజ్ఞాన్ కళాశాల లో నిర్వహణ





**కూర్మన్నపాలెం :పెన్ పవర్ , మార్చి 12:** దువ్వాడ విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆటానమస్, లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నెక్స్ట్–జెనరేషన్ ఆటోమేషన్: లెవరేజింగ్ జెన్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ, మరియు ఐబిఎం వాట్సన్ ఎక్స్ అనే అంశంపై మార్చి 12 తేదీ అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు.

సిస్టమ్స్ ఐసీటీ ఇండియా లిమిటెడ్, పుణే లో లీడ్ ఆటోమేషన్ ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్న రమణ హాజరై ప్రసంగించారు. జెనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ, ఐబిఎం వాట్సన్ ఎక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు ఆటోమేషన్ రంగంలో ఎలా మార్పులు తీసుకువస్తున్నాయో వివరించారు. విద్యార్థులు మరియు ఉద్యోగులు ఏఐ ఆధారిత ఆటోమేషన్ టూల్స్ ను ఉపయోగించి ఉత్పాదకత, సృజనాత్మకత మరియు నిర్ణయ సామర్థ్యాన్ని ఎలా మెరుగుపరుచుకోవచ్చో వివరించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ మరియు ఇంటెలిజెంట్ ఆటోమేషన్ రంగాలలో నైపుణ్యం కలిగిన నిపుణులకు ప్రస్తుతం విపరీతమైన అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలో ముందుండాలంటే విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, ప్రాక్టికల్ అనుభవాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని, ఆటోమేషన్ మరియు ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాల భవిష్యత్తు గురించి విలువైన అవగాహన పొందారు. డా. పి. విశ్వేశ్వరరావు, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు డా. జె. పీటర్ ప్రవీణ్, అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యయం లో నిర్వహించారు . కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగాధిపతి డా. టి.వి. మధుసూదనరావు ఈ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించిన విభాగాన్ని అభినందించారు. విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి విద్యా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గోపాలపట్నం సి.హెచ్.సిలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం ప్రారంభం

- ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా నిర్వహణ
- ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 12 :** ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని 92వ వార్డు గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి.హెచ్.సి) ఆస్పత్రిలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం మరియు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గీతం మెడికల్ కాలేజ్ వైద్యుల సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

**కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తే అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వం మరియు వైద్య సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**ఉచిత పరీక్షలు మందుల పంపిణీ..**

గీతం మెడికల్ కాలేజ్‌కు చెందిన నిపుణులైన వైద్య బృందం శిబిరంలో పాల్గొని రోగులకు కిడ్నీ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సరైన ఆహారపు అలవాట్లు, తగినంత నీరు త్రాగడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ సుజాత, గీతం మెడికల్ కాలేజ్ వైద్య బృందం సభ్యులు, స్థానిక నాయకులు, ఆస్పత్రి సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఇటువంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## ఆర్గానిక్ పంటలు... జీవ వైవిధ్య విధానానికి సిరిసంపదలు.





**సేంద్రీయ పద్ధతుల రాగి ఉత్పత్తికి రైతులు ముందుకు రావాలి.**

**ఆర్ ఏ ఆర్ ఎస్ ఏ డి ఆర్ ఆల్ అప్పలస్వామి.**

**:పెన్ పవర్ , మార్చి 12:** గిరిజన ప్రాంతాలలో చిరుధాన్యాల ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆచార్య ఎన్జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులు మెగా రాగి మేళాను నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడిఏ) బీవీ తిరుమలరావు అధ్యక్షతన రైతు సదస్సు అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో చిరుధాన్యాల ఉత్పత్తికి కేవలం గిరిజన ప్రాంతం మాత్రమే అత్యంత అనుకూలంగా ఉంటుందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి గిరిజన ప్రాంతాలలో చిరుధాన్యాల ఉత్పత్తి పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది అన్నారు. రానున్న రోజులలో రాష్ట్రానికి అవసరమైన చిరుధాన్యాలు గిరిజన ప్రాంతంలోని ఉత్పత్తి జరుగుతుందన్నారు. గతంలో ఆదివాసీలు రాగి కొర్ర సామ జొన్నలను సాగు చేసేవారన్నారు. కాలక్రమంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం బాగా తగ్గిందన్నారు. చిరుధాన్యాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు వ్యవసాయ శాఖ కృషి చేస్తుందన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో రాగి సాగును ప్రోత్సహిస్తుందన్నారు. గతంతో పోల్చుకుంటే రాగిలో దిగుబడి శాతం రెండేళ్లుగా గణనీయంగా పెరిగిందన్నారు. గిరిజన రైతులు మేలి జాతి రాగి వంగడాలు అందించేందుకు పరిశోధనలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇంద్రావతి , చంపావతి, భారతి, శ్రీ చైతన్య తెల్ల రాగులు సువర్ణముఖి రకాలను అందుబాటులోకి తీసుకొని రావడం జరిగిందన్నారు. గిరిజన రైతులు దీర్ఘకాలిక రకాలను విడిచిపెట్టి స్వల్పకాల రకాలను సాగు చేసుకోవాలన్నారు. రైతులు ఆధునిక యాజమాన్య పద్ధతులను పాటిస్తూ గుళి జమున పద్ధతిలో సాగు చేసుకోవాలన్నారు. ఏడిఏ బీవీ తిరుమలరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంత రైతులకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలు ఎరువులు పంపిణీ చేస్తుందన్నారు. రాజ్మా విత్తనాలను 90% రాయితీపై అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది రాజ్మా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది అన్నారు. దీనివల్ల రైతుల ఆదాయం రెట్టింపు అయిందన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందన్నారు. రాయితీపై యంత్ర పరికరాలు అందజేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించిందని రైతులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం రాయితీ యంత్రాలు వినియోగంపై వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలకు వివరించారు. చిరుధాన్యాల్లో లభించే పోషకాలు ఎగుమతులకు అనువైనా రకాలు విలువ ఆధారిత ఉత్పత్తులు వంటి అంశాలపై ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. వ్యవసాయ ఎరువులు యంత్రాల స్టాళ్లను గిరిజన రైతులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి టి మధుసూదనరావు, ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఏఎంసీ చైర్పర్సన్ కిలో ఊర్మిళ, వైస్ చైర్మన్ హస్వంత్, పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జి గేమ్ అబ్బాయి నాయుడు, టిడిపి మండలాధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు రీమల ఆనందరావు, ఏఎంసీ డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, చెన్నకేశవ నాయుడు, ఈశ్వరమ్మ, పిఎసిఎస్ కార్యదర్శి జగన్మోహన్రావు, బిజెపి నాయకుడు కదుల్ల శ్రీనివాసరావు, జనసేన నాయకుడు వంతల బుజ్జిబాబు, టిడిపి నాయకుడు లక్కోజు నాగభూషణం, శాస్త్రవేత్తలు సందీప్ నాయక్, జోగారావు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవం



- ఈనెల 17తో ముగియనున్న మేయర్,కార్పొరేటర్ల పదవీకాలం
- కార్యకర్తలలో నూతన ఉత్సాహం నింపిన పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- 12 వ వార్డు అధ్యక్షుడు మొల్లి హేమంత్

**విశాఖ తూర్పు,పెన్ పవర్, మార్చి 12:** వైయస్సార్సీపి16 వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం12 వ వార్డు అధ్యక్షుడు మొల్లి హేమంత్, పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు వార్డు కార్పొరేటర్ రోహిణి పాల్గొనీ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి ఎంతో శ్రమించి పార్టీ బలోపేతానికి కృషి చేసి,పార్టీ యొక్క జెండా అజెండాను ప్రజల్లో తీసుకు వెళ్లి పార్టీ పేరుతో ఉన్నత పదవులను అధిరోహించిన ప్రతి ఒక్కరికి, నాయకులకు కార్యకర్తలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శు భాకాంక్షలుతెలియజేసారు.

విశాఖ జీవీఎంసీ మేయర్ కార్పొరేటర్ పదవీకాలం ఈనెలలో ముగియనుందని, రాబోయే రోజులలో పార్టీ చేపట్టి కార్యక్రమాలకు నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా రావాలని,పార్టీ బలోపేతానికి సమిష్టి కృషి అవసరమని పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి పని చేయవలసి ఉందని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి అవసరమైన కార్యచరణ చేపట్టాలని,వార్డు అధ్యక్ష కార్యవర్గానికి అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో వార్డు వైస్ ప్రెసిడెంట్ బంధం శ్రీనివాస్. రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు సత్తి మందా రెడ్డి,రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు అల్లంపల్లి రాజబాబు సిటీ మున్సిపల్ విభాగం ప్రచార కమిటీ విభాగం జ్యోతి ప్రకాష్, మున్సిపల్ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నెటి సుబ్బారెడ్డి మహిళా అధ్యక్షురాలు సుజాత,మురళి,ముద్దాడ పాపారావు సత్యనారాయణ కొండమ్మ,మోహన్, శ్రీనివాస్ రెడ్డి,వరహాల రావు కిషోర్ రెడ్డి సంజీవ్,ఒమ్మి వెంకట్, మణిచంద్,వినోద్,దీపక్,హరి,వర్ధన్,సత్యవతి.మౌళి లక్ష్మణరావు ప్రసాద్, కార్యకర్తలు.పాల్గొన్నారు


## నందిగరువు గ్రామాన్ని సందర్శించనున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్ మార్చి 12:**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ నెల 14న అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంటలమామిడి పంచాయతీ పరిధిలోని నందిగరువు గ్రామాన్ని సందర్శించనున్నారు.ఈ పర్యటనలో భాగంగా "అడవి తల్లి బాట" కార్యక్రమం కింద గిరిజన గ్రామాలకు అనుసంధానమయ్యే రహదారుల పరిస్థితిని ఆయన పరిశీలించనున్నారు. అనంతరం గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని చర్చించనున్నట్లు సమాచారం.ఈ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఈ నెల 13న విశాఖపట్నం గ్రామీణ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాడేరు చేరుకోనున్నారు.జిల్లా పరిధిలోని జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమి ఛైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య కోరారు.

## కేజీహెచ్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

కళా హాస్పిటల్ నుంచి ట్రాఫిక్ స్టాపర్స్ విరాళం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 12 :**ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రధాన వైద్య సేవలు అంది స్తున్న కింగ్ జార్జ్ ఆసుపత్రిలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు నగరంలోని ప్రముఖ వైద్య సంస్థ కళా హాస్పిటల్ ముందుకు వచ్చింది. హాస్పి టల్ సౌజన్యంతో సుమారు రూ. 2 లక్షల వ్య యంతో ట్రాఫిక్ స్టాపర్స్‌ను కేజీహెచ్‌కు అందజే శారు.గురువారం కేజీహెచ్ సముదాయంలో జరిగిన కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెం డెంట్ డాక్టర్ ఐ వాణి సమక్షంలో కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి ట్రాఫిక్ స్టాపర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐ వాణి మాట్లాడుతూ కేజీహెచ్‌కు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుం డి కూడా నిత్యం వేలాది మంది రోగులు, వారి కుటుంబ సభ్యులు వస్తున్నారని తెలిపారు. దీం తో ఆసుపత్రి పరిసరాల్లో తరచూ ట్రాఫిక్ సమ స్యలు తలెత్తుతున్నాయని చెప్పారు.

ఇలాంటి పరిస్థితుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేం దుకు ట్రాఫిక్ స్టాపర్స్ ఎంతో ఉపయోగపడతా యని ఆమె పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్వహణ కు సహకారం అందించేందుకు కళా హాస్పిటల్ ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు.ఈ సందర్భంగా కేజీహెచ్ తరపున కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటర మణమూర్తికి ప్రశంసాపత్రాన్ని అందజేసి సూప రింటెండెంట్ డాక్టర్ ఐ వాణి అభినందించారు.

ఈ కార్యక్రమంలో కేజీహెచ్ డిప్యూటీ కలెక్టర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ బొడ్డేపల్లి వెంకట రమ ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశే ఖర్ నాయుడు, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆశయాల సాధనకే వైఎస్ఆర్‌సీపీ పోరాటం







- పాడేరు కేంద్రంలో వైఎస్ఆర్‌సీపీ ఆవిర్భావ వేడుకలు
- ప్రజా సంక్షేమమే వైఎస్ఆర్‌సీపీ ధ్యేయం:ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్ మార్చి 12:** పాడేరు ఎమ్మెల్యే మత్స్యరస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పాడేరు జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ స్థాపనకు 15 సంవత్సరాలు పూర్తై 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాడేరు పాత బస్టాండ్ వద్ద ఉన్న వై.ఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.తదనంతరం నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. జిల్లా ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్‌లు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, రాజన్న ఆశయ సాధనలో ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనకడుగు వేయకుండా వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రజల నమ్మకంతో పార్టీని ముందుకు తీసుకెళ్లారని అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వైద్యం, విద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు.రాష్ట్ర ప్రజలు మళ్లీ రాజన్న ఆశయాలు, జగన్ పాలన కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మళ్లీ ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యురాలు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీధరి మంగ్లన్న దొరా, జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, వైస్ ఎంపీపీ కుంతురు కనకాలమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు గంగరాజు, వాలంటరీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్ము సురేష్, వాలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొమ్మ రాంబాబు, మాజీ ఎఎంసీ చైర్మన్ లకే రామ సత్యవతి, మండల యువజన అధ్యక్షుడు గుల్లెల లింగమూర్తి, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, చిప్పడ మీనా, తుపూరు ఎర్రయ్యమ్మ, సర్పంచులు వనుగు బసవన్న దొర, గొల్లూరి నీలకంఠం, మాజీ సర్పంచ్ పాంగి నాగరాజు, సీనియర్ నాయకులు మోద బాబురావు, ముదిలి సత్యనారాయణ, తుపూరు రంగరాజు, వంతాల నరేష్, పలాసి రామారావు, బెదర బంగార్రాజు, వైస్ సర్పంచ్ మినుముల వెంకటరావు, దుడ్డు లక్కోజీ, నర్సింగరావు, రాజారావు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ ఉత్సవాలు.

- 16వ సంవత్సరంలో అడిగిన సందర్భంగా సంబరాలు.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 12.** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సంబరాలను వైసీపీ శ్రేణులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. గురువారం స్థానిక పాత బస్టాండ్ కూడలిలు దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కేకును కట్ చేసి వైయస్సార్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 వసంతాలు పూర్తిచేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు పార్టీ అత్యంత చేరువయ్యిందన్నారు. అనతి కాలంలోనే ప్రజల మన్ననను చూరగొన్న పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు వైయస్సార్ పార్టీకి పట్టం కట్టాలని అత్యంత విశ్వాసంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్యా పుష్పలత, ఎంపీటీసీ ధారలక్ష్మి, వైసిపి మండల మాజీ నాయకుడు మోరి రవి, ఏఎంసీ మాజీ చైర్పర్సన్ జల్లి హలియా రాణి, వైసీపీ నాయకుడు జల్లి సుధాకర్, కేశవరావు మండల వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


## మత్స్యగెడ్డలో గల్లంతయిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహాయం

- కుటుంబానికి పరామర్శించి ధైర్యపరిచిన కూటమి నాయకులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 12.** మండలంలో గల సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామస్తుడు వంతాల గోపినాథ్ (72) రెండు రోజుల క్రితం మత్స్య గెడ్డలో స్నానానికి వెళ్లి ప్రమాదవసత్తు కాలుజారి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ విషయాని ముంచంగిపుట్టు మండల టీడీపీ నేతలు రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్ దృష్టికి తెలుపగా ఆయన స్పందించి గల్లంతైన వాని కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. గోపీనాథ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఎటువంటి సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని, భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య, స్థానిక సర్పంచ్ వెంగడ రమేష్, మండల టీడీపీ కార్యదర్శి కొంతేరి జాగ్రాయ్, అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ మాజీ సెక్రటరీ పాంగి శాస్త్రి బాబు, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు కిల్లో బలరాం, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ నిలకంఠం పాత్రో, సర్పంచ్ వి లక్ష్మణ్, జనసేన మండల కార్యదర్శి గొల్లోరి సతీష్, టీఎన్టియు కార్యదర్శి గొల్లోరి రఘునాథ్, కోశాధికారి వంతల జగదీష్, టీడీపీ మండల ఆర్గనైజేషన్ సెక్రటరీ మండి ప్రభాకర్, క్లస్టర్ ఇంచార్జులు మజ్జి చిన్ని, బి రామారావు, సోషల్ మీడియా కన్వీనర్ చెట్టి నవీన్ కుమార్, వార్డు మెంబర్ బలరాం, యూనిట్ ఇంచార్జ్ కొండసీమ సింహాచలం, టీఎన్టియు అధ్యక్షులు పాంగి హరీష్, సమరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లిలో మెగా కార్డన్ మరియు సెర్చ్





ఆపరేషన్ "వజ్రప్రహార్"లో గంజాయి, డ్రగ్ ఇంజెక్షన్లు స్వాధీనం
9 బైకులు సీజ్ పోలీసులు

**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 12 :** ఆంధ్రప్రదేశ్‌లో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా అనకాపల్లి సబ్-డివిజన్ పరిధిలో గురువారం భారీ స్థాయిలో మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏఎంసి కాలనీ, చేపల బజార్, విజయరామరాజుపేట ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాంగం పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్‌కు ఎస్డిపిఓ ఎం.శ్రావణి నాయకత్వం వహించారు. అనకాపల్లి టౌన్ (ఎల్ అండ్ ఓ), ట్రాఫిక్, రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, ఈగల్ టీమ్, స్పెషల్ పార్టీలు కలిసి మొత్తం 115 మంది పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఇళ్లలో, పాడుబడిన భవనాల్లో సోదాలు..**

మెగా కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా ఏఎంసి కాలనీ పరిసర ప్రాంతాల్లో గృహ సముదాయాలు, పాడుబడిన ఇళ్లు, అనుమానాస్పద ప్రదేశాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గతంలో గంజాయి కేసుల్లో ప్రమేయం ఉన్న వ్యక్తుల ఇళ్లలో కూడా ప్రత్యేకంగా సోదాలు చేపట్టారు.

ఈ తనిఖీలలో భాగంగా పోలీసులు ఇళ్లను, వ్యక్తులను, వాహనాలను పరిశీలించారు. వాహనాల తనిఖీలలో రికార్డులు లేని 9 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**గంజాయి, డ్రగ్ ఇంజెక్షన్లు స్వాధీనం..**

పోలీసులు నిర్వహించిన సోదాల్లో మూడు చోట్ల మాదకద్రవ్యాలు స్వాధీనం అయ్యాయి.

నిమ్మకాయల జ్యోతి సూర్య ప్రభాకర్ ఇంటి వద్ద నుంచి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దొడ్డి తిమోతి, ఆది ఇంటి వద్ద నుంచి 4 కిలోల గంజాయి పట్టుకున్నారు.

మల్లంపర్తి గణేష్, రామ్స్ ఇంటి వద్ద డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో మెఫెంట్మిన్ సల్ఫేట్ ఇంజక్షన్ ఐపి బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.

**డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన..**

ఈ సందర్భంగా పోలీసు అధికారులు స్థానిక ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు.

**సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి..**

ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 లేదా 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

**వజ్రప్రహార్ ప్రతిజ్ఞ..**

ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలతో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టేందుకు "ఆపరేషన్ వజ్రప్రహార్" కింద ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## ఎం ఎస్ ఎం ఈలతో ఉపాధి అవకాశాలు విస్తృతం





- ఇంజనీరింగ్ విద్యార్థులకు పవర్ బిఐ వర్క్‌షాప్
- ఎంట్రప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం

**పెందుర్తి, పెన్ పవర్, మార్చి 12 :** మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎం ఎస్ ఎం ఈ) స్థాపించడం ద్వారా యువత స్వయం ఉపాధిని పొందడమే కాకుండా మరికొంతమందికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని ఎం ఎస్ ఎం ఈ కార్పొరేట్ ట్రైనర్ సాయి తేజ తెలిపారు. బెహరా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎం ఎస్ ఎం ఈల ప్రాముఖ్యతపై సాయి తేజ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా 20 రోజుల పాటు పవర్ బి ఐ వర్క్‌షాప్‌తో పాటు "ఎంట్రప్రెన్యూర్‌గా ఎలా మారాలి" అనే అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టారు. వర్క్‌షాప్‌లో భాగంగా విద్యార్థులకు పవర్ బి ఐ ద్వారా డేటా విజువలైజేషన్, డేటా అనలిటిక్స్ మరియు వివిధ రకాల రిపోర్టుల తయారీ విధానాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఆధునిక డేటా విశ్లేషణ పద్ధతులను ఉపయోగించి వ్యాపార నిర్ణయాలు ఎలా తీసుకోవచ్చో వివరించారు.

అదేవిధంగా ఎంట్రప్రెన్యూర్‌గా ఎదగడానికి అవసరమైన వ్యాపార ఆలోచనలు, సమర్థవంతమైన బిజినెస్ ప్లానింగ్, నాయకత్వ లక్షణాలు మరియు మార్కెట్‌లో ఉన్న అవకాశాల గురించి సవివరంగా వివరించారు. కొత్త ఆలోచనలు మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే యువత స్వయం ఉపాధి రంగంలో విజయవంతంగా ముందుకు సాగవచ్చని ఆయన సూచించారు.

ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పొందడమే కాకుండా స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టే ఆలోచనలు పెరుగుతాయని సాయి తేజ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీహెచ్ పిల్లల విభాగానికి ఆధునిక వైద్య పరికరాలు

- రూ.32 లక్షల విలువైన వెంటిలేటర్లు, అల్ట్రాసౌం డ్ యంత్రం ప్రారంభం
- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 12. :**కింగ్ జార్జ్ హాస్పిటల్ పిల్లల విభాగానికి ఆధునిక వైద్య సదుపాయాలు మరింత బలపడాయి. గు రువారం ఆంధ్ర మెడికల్ కాలేజ్ / కేజీహెచ్ పిల్ల ల విభాగంలో రూ.20 లక్షల విలువైన నాన్- ఇన్వేసివ్ వెంటిలేటర్లు మరియు రూ.12 లక్షల విలువైన పిల్లల అల్ట్రాసౌండ్ యంత్రాన్ని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ యాదవ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర మెడి కల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. కె.ఎస్.వి.ఎం. సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ రమణ, పిల్లల విభాగాధిపతి డా. బి.ఎస్. చక్రవర్తి, అలాగే ఆంధ్ర మెడికల్ కాలేజ్‌కు చెందిన పలు విభాగాల హెడ్ లు, అధ్యాపకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పిల్లల విభాగాధిపతి డా. బి.ఎస్. చక్రవర్తి మా ట్లాడుతూ విభాగ అభివృద్ధికి సహకరించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ము ఖ్యంగా ఆంధ్ర మెడికల్ కాలేజ్ అలుమ్ని 1966 బ్యాచ్‌కు చెందిన డా. నాగుల సీతారామయ్య విభాగానికి మొత్తం రూ.80 లక్షల విలువైన పరికరాలను అందించడం అభినందనీయమ న్నారు. అలాగే కేజీహెచ్‌లో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం, ఆంధ్ర మెడి కల్ కాలేజ్‌లో డీఎం నియోనటాలజీ కోర్సు ప్రారం భానికి ఎమ్మెల్యే సహకారం కోరారు.ప్రిన్సిపల్ డా. సంధ్యా దేవి మాట్లాడుతూ డా. నాగుల సీతారామయ్య వంటి దాతలు ముందుకు రావ డం ఇతరులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. పిల్లల విభాగం సమన్వయంతో పనిచేస్తూ సంస్థ కు మంచి పేరు తీసుకువస్తోందని ప్రశంసించా రు.కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి మాట్లాడుతూ పిల్లల విభాగం వైద్యులు, సిబ్బం ది సమిష్టిగా పనిచేస్తూ ముఖ్యంగా పిల్లల ఐసీ యూ సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారని అభినందించారు.ఎమ్మెల్యే వంశీ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ దాతల సేవలను ప్రశంసిస్తూ మరెంతో మంది దాతలు కేజీహెచ్ మరియు ఆంధ్ర మెడికల్ కాలేజ్ అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. అలాగే ఎంసీహెచ్ బ్లాక్ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కాలేజ్ అలు మ్ని 1966 బ్యాచ్ ప్రతినిధి డా. జి.వి. రావును పిల్లల విభాగానికి రూ.32 లక్షల విలువైన పరిక రాలను అందించినందుకు అతిథులు సన్మానిం చారు.

## సింహాచలం కొండపై అనధికార షాపుల తొలగింపు

- పర్వదినాల దృష్ట్యా దేవస్థానం ప్రత్యేక డ్రైవ్

**సింహాచలం, పెన్ పవర్, మార్చి 12 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం సింహాచలంలో భక్తుల సౌకర్యం మరియు భద్రతను దృష్టిలో ఉంచుకుని కొండపై ఉన్న బస్టాండ్ ఆవరణలోని అనధికార షాపులను దేవస్థానం అధికారులు తొలగించారు. రాబోయే ప్రధాన పర్వదినాలు మరియు ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ పెరుగనున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు తెలిపారు.

**భక్తుల సౌకర్యార్థం ముందస్తు చర్యలు..**

సింహాచలం పుణ్యక్షేత్రానికి ప్రతి రోజు వేలాది మంది భక్తులు దర్శనార్థం వస్తుంటారు. త్వరలో జరగనున్న స్వామివారి కల్యాణం మరియు అత్యంత ప్రతిష్టాత్మకమైన చందనోత్సవం సందర్భంగా భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో బస్టాండ్ ఆవరణలో ఉన్న అనధికార దుకాణాలను తొలగించి ఖాళీ ప్రదేశాన్ని సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

**తాత్కాలిక షెడ్డులు, క్యూలైన్ల ఏర్పాటు..**

బస్టాండ్ వద్ద భక్తులు బస్సులు ఎక్కే సమయంలో ఎండ వేడికి ఇబ్బంది పడకుండా తాత్కాలిక షెడ్డులు నిర్మించనున్నట్లు ఈవో వెల్లడించారు. అలాగే రద్దీని నియంత్రించేందుకు క్రమబద్ధమైన క్యూలైన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల భక్తుల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉండటంతో పాటు రద్దీ సమయంలో కలిగే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.

**భక్తుల భద్రతకు ప్రాధాన్యం..**

భక్తుల వద్ద ఉండే నగదు, బంగారం వంటి విలువైన వస్తువులు రద్దీ సమయంలో చోరీకి గురికాకుండా ఉండేందుకు కూడా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు. బస్టాండ్ ఆవరణలో తగినంత ఖాళీ ప్రదేశం ఉండేలా చర్యలు తీసుకోవడం ద్వారా భక్తుల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

**దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్..**

ఈ ప్రత్యేక డ్రైవ్ లీజస్ డిపార్ట్మెంట్ ఏఈఓ పి. జగ్గారావు, సూపరింటెండెంట్ జి.ఎన్. సత్యవాణి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. దేవస్థానం గార్డులు మరియు సిబ్బంది సహకారంతో ఈ చర్యలు విజయవంతంగా పూర్తయ్యాయి.

**భక్తుల నుంచి హర్షం..**

భక్తుల ప్రయాణ సౌకర్యం మరియు భద్రత కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అప్పన్న స్వామి భక్తులు స్వాగతిస్తున్నారు. రాబోయే పెద్ద ఉత్సవాల సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ముందస్తు చర్యలు తీసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

"భక్తుల భద్రత మరియు సౌకర్యమే మా ప్రథమ ప్రాధాన్యత. రాబోయే పెద్ద ఉత్సవాల దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఈవో జె. వెంకట్రావు తెలిపారు.

## చింతపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర నిర్వహణ కు ఉగాది రోజున సమావేశమవుదాం.

- సమయము ఉగాది రోజు సాయంత్రం మూడు గంటలకు.
- ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ధర్మకర్త అప్పారావు.

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 12**

చింతపల్లి గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర నిర్వహణ కు తేదీలు నిర్ణయించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఉగాది రోజున సాయంత్రం మూడు గంటలకు స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని ఆలయ ధర్మకర్త, పూజారి సుర్ల అప్పారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏట మాదిరిగా ఆనవాయితీ గా వస్తున్న ఉగాది రోజున అందరి సమక్షంలో తేదీలు నిర్ణయించేందుకు అన్ని వర్గాల ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది రోజున స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద సాయంత్రం మూడు గంటలకు సమావేశం కావాలన్నారు. కుల మతాలకతీతంగా నిర్వహించుకునే గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర నిర్వహణకు, జాతర విజయ వంతానికి ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో పాటు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, ముత్యాలమ్మ అమ్మవారి భక్తులు యావన్మంది, ముఖ్యంగా కార్యక్రమ నిర్వహణ లోనూ, ఆ జాతర విజయవంతం అయ్యేందుకు సహాయ, సహకారాలు అందించే పోలీసులు, పాత్రికేయులు ఉగాది రోజున నిర్వహించే సమావేశానికి హాజరై తేదీల నిర్ణయం తో పాటు జాతర నిర్వహణ సజావుగా నిర్వహించేందుకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని, అదే క్రమంలో జాతర విజయవంతానికి కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు మాదల తిరుపతి రావు, సుర్ల వీరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com